
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు జిల్లా వార్తలు 5
శనివారం 12 ఏప్రిల్ 2025



మనసారా నవోదయం..!



కల్లూరు మండలం ఎర్రకత్వతండాలో ఎక్సైజ్ అధికారుల అవగాహన

- నాటు సారా రహిత రాష్ట్రమే చంద్రబాబు లక్ష్యం
- పక్కాగా నవోదయం 2.0 అమలుకు శ్రీకారం
- 110 గ్రామాల్లో నాటు సారా తయారీ, అమ్మకాలు
- మూడు కేటగిరీలుగా విభజన
- స్వచ్ఛందంగా తయారీ మానేస్తే స్వయం ఉపాధి కల్పనకు సన్నాహాలు

కర్నూలు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఆరోగ్యాన్ని హానికరం చేసే నాటుసారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపడమే కాకుండా 'నవోదయం 2.0' పేరుతో నాటుసారా రహిత రాష్ట్రంగా మార్చేందుకు సంకల్పించారు. కర్నూలు జిల్లాలో 110 గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో నాటు సారా తయారీ, విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించారు. నవోదయం 2.0 అమలుతో సాటుసారా రహిత గ్రామాలే లక్ష్యంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అవగాహన సదస్సులు చేపట్టారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ ఉన్న ఏడు స్టేషన్ల పరిధిలో 110 మద్యం షాపులు, 23 బార్లు ఉన్నాయి. గత జగన్ ప్రభుత్వం హయాంలో తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీ పేరుతో దుకాణాల్లోనే ప్రభుత్వం యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగించారు. ధరలు పెంచితే మద్యం మానేస్తారనే బూచి చూపి ఇష్టారాజ్యంగా ధరలు పెంచేశారు. అంతేకాదు మద్యం ప్రియులకు ఇష్టమైన బ్రాండ్ల మద్యం కాదని మునుపెన్నడు చూడని బ్రాండ్ల మద్యం అమ్మకాలు చేపట్టారు. నాసిరకం మద్యాన్ని కూడా విక్రయించి ప్రజారోగ్యాన్ని దెబ్బతీశారు. దీంతో మద్యం ప్రియులు నాటు సారాకు, కర్ణాటక మద్యం వైపు దృష్టి సారించారు. జిల్లాలో పలు గ్రామాలు సాటునారా తయారీ కేంద్రాలుగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం అమ్మకాల్లో తీసుకొచ్చిన సమూల మార్పుల కారణంగా అమ్మకాలు పెరిగాయి. గత ప్రభుత్వంలో నెలకు సగటున రూ.65-70 కోట్ల మద్యం అమ్మకాలు చేస్తే.. ప్రస్తుతం రూ.90-95 కోట్లకు చేరిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు. నాటుసారా వైపు వెళ్లకుండా కార్టర్ రూ.99కే నాణ్యమైన లిక్కరును అందుబాటులోకి తెచ్చారు. ఈ నిర్ణయం సామాన్యుల ప్రాణాలకు ముప్పుగా మారిన నాటునారా నిర్మూలనకు ప్రభుత్వం నాంది పలికింది.



నవోదయం 2.0 టోల్ ఫ్రీ నంబరు పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టరు పి. రంజిత్‌బాషా, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు తదితరులు

110 గ్రామాల్లోపై దృష్టి

కూటమి ప్రభుత్వం సాటుసారా రహిత గ్రామాలే లక్ష్యంగా నవోదయం 2.0 అమలుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో సారా తయారీ, అమ్మకాలు చేసే 110 గ్రామాలు, పట్టణ ప్రాంతాలు గుర్తించి మూడు కేటగిరీలుగా విభజించారు. పక్కాగా అమలు కోసం పోలీస్, రెవిన్యూ, అటవీ శాఖ అధికారులను భాగస్వామ్యం చేశారు.

- సారా తయారీకి మాత్రమే పరిమితమైన గ్రామాలను ఏ కేటగిరీలో చేర్చారు. కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు, వెల్దుర్తి, ఆదోని, ఆలూరు, హొళగుంద, పత్తికొండ, తుగ్గలి మద్దికెర, దేవనకొండ మండలాల్లో 25 గ్రామాలను గుర్తించారు.
- తయారీతో పాటు విక్రయాలు సాగించే గ్రామాలను బీ కేటగిరీలో చేర్చారు. ఆస్పరి, మంత్రాలయం, కోసిగి, పెద్దకడుబూరు, పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, దేనవకొండ, కర్నూలు, ఓర్వకల్లు, కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో 25 గ్రామాలు గుర్తించారు.
- కేవలం నాటుసారా అమ్మకాలు చేసే గ్రామాలను సీ కేటగిరీ కింద చేర్చారు. కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు, కృష్ణగిరి, వెల్దుర్తి, ఆస్పరి, కోసిగి, పెద్దకడుబూరు, పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, దేవనకొండ, గోనేగండ్ల మండలాల్లో 60 గ్రామాలు గుర్తించారు.



గుడుంబాయితండాలో నాటుసారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

సారా నిర్మూలనకు నాలుగు దశలు

రాష్ట్రం నాటుసారా రహిత ఏపీగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం 'నవోదయం 2.0' అమలుకు శ్రీకారం చుట్టింది. తయారీ, అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించిన గ్రామాల్లో నాలుగు దశల్లో కార్యక్రమాల అమలుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

- **సంసిద్ధం:** తొలి దశలో సారా తయారీ, అమ్మకందారులను గుర్తించాలి. వారిలో సంపూర్ణ అవగాహన కల్పించడం, ఇక నుంచి నాటుసారా తయారీ, అమ్మకాలు చేయబోమని వారిని సంసిద్ధం చేయడం. ఇందుకోసం గ్రామాల్లో గ్రామ సభలు, అవగాహన సదస్సులు, నారా వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్య సమస్యలపై కళాజాతల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 500 మంది వరకు తయారీ, అమ్మకందారులు ఉన్నట్లు గుర్తించారు.
- **దాడులు:** రెండో దశలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన గ్రామాల్లో మళ్లీ సారా తయారీ, అమ్మకాలు చేస్తుంటే దాడులు చేయడం. ఇప్పటివరకు 17 కేసులు నమోదు చేసి 18 మందిని అరెస్టు చేశారు. 106 లీటర్ల సారా, 3,640 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. దాడులు కొనసాగుతున్నాయి.
- **పునరావాసం:** మూడో దశలో గుర్తించిన సారా తయారీ, అమ్మకందారులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించడం. వారికున్న నైపుణ్యానికి అనుగుణంగా ఆటోలు, పాడి పరిశ్రమ, వ్యవసాయం, వ్యాపారం.. వంటి వాటికి రుణసౌకర్యం.
- **డిక్లరేషన్:** నాలుగో దశలో నాటు సారా తయారీ, అమ్మకాలను పూర్తిగా మానేసిన గ్రామాలు, పట్టణ ప్రాంతాలను 'సారా రహిత గ్రామలు'గా డిక్లరేషన్ ఇవ్వడం.

మిగతా 6వ పేజీలో

మహనీయుడు జ్యోతిబా పూలే

కలెక్టర్ పి. రంజిత్‌బాషా



నివాళి అర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

కర్నూలు ఎడ్యుకేషన్ , ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ అధ్వర్యంలో శుక్రవారం స్థానిక బిర్లా గేట్ కూడలిలో జ్యోతిబా పూలే విగ్రహానికి కలెక్టర్ రంజిత్ బాషా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని ఒక పండుగలాగా దేశమంతా జరుపుకుంటునారని అన్నారు. ఆయన ఆశయాలకు అందరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయా కార్పొరేషన్లకు బడ్జెట్ కేటాయించి, స్వయం ఉపాధి పథకాలను అమలు చేస్తున్నదన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ జ్యోతిబా పూలే కుల వివక్షను రూపుమాపాలనే లక్ష్యంతో పని చేశారన్నారు. కుల, లింగ విబేదాలు నశించి అన్ని రంగాల్లో సమానత్వం కోసం పోరాడారని కొనియాడారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు మాట్లాడుతూ అంటరాతనం, వర్ణ వ్యవస్థ, స్త్రీ విద్య కోసం ఆయన సమాజంలో విప్లవాన్ని తీసుకువచ్చారని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నుంచి బీసీ ఆర్థికంగా వెనుకబడిన వారికి కాపు కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకం కింద 108 మంది లబ్ధిదారులకు రూ.11.77 కోట్ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కే.ఈ. ప్రభాకర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. నాగేశ్వరరావు యాదవ్, కురువ సంఘం డైరెక్టర్ రామక్రిష్ణ, టీడీపీ నంద్యాల పార్లమెంటు అధ్యక్షురాలు పార్వతి, ధనుంజయ ఆచారి, శేషఫణి, వాడాల నాగ రాజు, వెంకటేశ్వర్లు, మధు, బాలసంజన్న, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యల సంఘం జిల్లా అధ్యక్షుడు బి. వాసుదేవయ్య పాల్గొన్నారు.

నేడు ఇంటర్ ఫలితాలు విడుదల



కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):ఇంటర్‌మీడియట్ ప్రథమ, ద్వితీయసంవత్సరం పరీక్షా ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. ఇంటర్‌మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 5 నుంచి 20వ తేదీ వరకు కొనసాగాయి. మార్చి 1 నుంచి ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం మార్చి 3 నుంచి పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 23,098 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 22,227 మంది నమోదు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 69 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఏప్రిల్ 2 నాటికి మూల్యాంకనం పూర్తయింది. శనివారం ఉదయం 11 గంటలకు ఇంటర్ పరీక్షా ఫలితాలు విడుదల చేస్తున్నట్లు ఆర్ఐఓ గురువయ్య ప్రకటించారు. విద్యార్థులు మిత్ర వాట్సాప్ ద్వారా 9552300009 నెంబరుకు మెసేజ్ చేసి మార్క్స్ మెమో పొందవచ్చని పేర్కొన్నారు.

డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌పై సస్పెన్షన్ వేటు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న అసిస్టెంటు డైరెక్టర్ వి. శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయరామ రాజు ఉత్తర్వులు జారీ చేసినట్లు డీ ఈవో శామ్యూల్ పాల్ శుక్రవారం తెలిపారు. కార్యాలయ మహిళ ఉద్యోగిపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడనే ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు కడప ఆర్జేడీ విచారణ నిర్వహించి నివేదిక పంపారు. దీనిని పరిశీలించి అసిస్టెంట్ డైరెక్టర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

స్థిరంగా పత్తి ధరలు

క్వింటా గరిష్ఠంగా రూ.7,979



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో వారం రోజులుగా పత్తి ధరలు స్థిరంగా ఉన్నాయి. శుక్రవారం పత్తి ధర క్వింటా గరిష్ఠంగా రూ.7,979 పలికింది. గత వారంలో ధరలు రైతులను ఊరించాయి. క్వింటా గరిష్ఠంగా రూ.8 వేలకు పైగా పలుకుతుందని రైతులు ఆశించారు. ఆశించిన స్థాయిలో ధరలు పెరగకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. 450 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.4,399, గరిష్ఠ ధర రూ.7,979, మధ్యస్థ ధర రూ.7,499 పలికింది.

సెలవు రోజు కూడా రిజిస్ట్రేషన్ సేవలు

డీఐజీ పీజీఎస్ కళ్యాణి

కల్లూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు 12వ తేది రెండో శనివారం సెలవు దినం కూడా పనిచేస్తాయని స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ పీజీఎస్. కళ్యాణి తెలిపారు శనివారం ఉదయం 11 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉండాలని డీఐజీ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్లు హాజరై ప్రజలకు రిజిస్ట్రేషన్లతో సహా అన్ని సేవలు అందించాలని డీఐజీ అధికారులకు సూచించారు. ప్రజలు ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎప్పటిలాగే రిజిస్ట్రేషన్లు నిర్వహించుకోవాలని కోరారు.

రేపు ఎమ్మెల్సీ బీటీ నాయుడికి సన్మానం

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రెండో పర్యాయం శాసన మండలికి ఏకగ్రీవంగా ఎంపికయిన ఎమ్మెల్సీ బీటీ నాయుడుకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీటీడీ బోర్డు మెంబర్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరవుతారని పేర్కొన్నారు.

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పుల్లయ్య

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడిగా జె.పుల్లయ్యను నియమించినట్లు జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి తెలిపారు. వెల్దుర్తి మండలం చెర్ల కొత్తూరుకు చెందిన టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిగా పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించి పార్టీ ఈ పదవి కట్టబెట్టిందని తెలిపారు.

పెద్దాసుపత్రిలో ఎఫ్ఆర్ఎస్ గందరగోళం

100 మంది గైర్హాజరైనట్లు నమోదు

కర్నూలు హస్పటల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఎఫ్ఆర్ఎస్ బయోమెట్రిక్ అధికారులు అలసత్వంతో గందరగోళంగా మారింది. శుక్రవారం వంద మంది నాల్గవ తరగతి సిబ్బంది, స్టాఫ్ నర్సులు, ఇతర ఉద్యోగులు తమకు ఎఫ్ఆర్ఎస్ పడలేదంటూ సూపరింటెండెంటు కార్యాలయానికి క్యూ కట్టారు. ఇందులో 53 మంది స్టాఫ్ నర్సులు ఉండగా ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓలు 30 మంది, ఇతర ఉద్యోగులు 20 మంది దాకా ఉన్నారు. ఉదయమే ఎఫ్ఆర్ఎస్ బయోమెట్రిక్ వేసినప్పుడు సిస్టమ్‌లో బ్లూ టిక్ మార్కు పడుతుందని, అది గైర్హాజరుగా చూపించిందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. నెట్‌వర్క్ టెక్నికల్ సమస్య వల్ల ఎఫ్ఆర్ఎస్ వేసినా బ్లూ టిక్ మార్కు పడుతుందని ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించకుండా ఉదయమే విధులకు వచ్చిన తమకు మెమోలు జారీ చేస్తామని చెప్పడం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. సూపరింటెండెంటు కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఎలాటి సమస్య లేదని, తమకు మాత్రమే ఈ సమస్య ఎందుకు తలెత్తిందని వారు ప్రశ్నించారు.



ఆందోళన చెందుతున్న ఉద్యోగులు

ఆర్వోఆర్ చట్టంపై అవగాహన పెంచుకోవాలి

రీ సర్వేలో తప్పులు చేయకండి.. కలెక్టర్ పి. రంజిత్‌బాషా

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్వోఆర్ చట్టంపై పూర్తి అవగాహన పెంచుకోవాలి అని కలెక్టర్ రంజిత్‌బాషా రెవెన్యూ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రెవెన్యూ అధికారులకు రెవెన్యూ అంశాలపై వర్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిష్కరించలేని భూ సమస్యలపై 14వ తేదీ లోపు పంపితే వాటిని సీసీఎల్ఏకు పంపుతామని ఆర్డీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు. పీజీఆర్ఎస్, మ్యూటేషన్‌కు సంబంధించి పెండింగ్ ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. సర్వేలో తప్పులు చేయకూడదని రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యల్ని రీ ఓపెన్ కాకుండా నాణ్యతతో పరిష్కరించాలని తహసీల్దార్లకు ఆదేశించారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్ఓ వెంకట నారాయణమ్మ, ఆర్‌డీఓలు సందీప్ కుమార్, భరత్ నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

నిండా భక్తి పారవశ్యం

- ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు
- ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి రథోత్సవం





పూజలందుకుంటున్న సుబ్రమణ్యేశ్వరస్వామి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోమప్ప నగర్‌లో కొలువైన సుబ్రమణ్యేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. పాత ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర ఉన్న శమీవృక్షం దగ్గర భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఒళ్లు గగుర్పొడిచేలా విన్యాసాలను ప్రదర్శించారు. తమ దవడలకు ఇనుప శూలాలను గుచ్చుకుని తమ భక్తిని చాటుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉత్సవమూర్తిని కొలువుదీర్చి రథాన్ని లాగే భక్తుడుతో పాటు మరో ఇద్దరు రెండు ఇనుప కొక్కీలను వీపునకు గుచ్చుకొని రథాన్ని లాగారు. రథోత్సవం పట్టణంలోని గాంధీ సర్కిల్, పెద్ద మసీదు, షరాఫ్ బజార్, సోమేశ్వర, శ్రీనివాస, మార్కెట్ కమిటి రోడ్డు, మార్కెట్ సర్కిల్ మీదుగా మేళ తాళాలు, డప్పు వాయిద్యాల మధ్య సాగింది. ఈ సందర్భంగా చిన్నారులు, పెద్దలు కావళ్లు, కలశాలు మోస్తూ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త యుజీ కేశవర్ధన, నిర్వాహకులు యుజీ ప్రకాష్ అన్నదానం ఏర్పాటు చేశారు.



పూర్ణ కుంభాలతో రథోత్సవంలో పాల్గొన్న మహిళా భక్తులు





కళ్యాణం.. వైభోగం



రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.


పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు


కళాకారుల నృత్యం


ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం




ఎదుర్కోలు దృశ్యం

సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు

ఒక్క క్షణం ఆలోచించు..!



- మార్కులే కొలమానం కాదు..
- మరణం సమస్యకు పరిష్కారం కాదు
- పరీక్ష తప్పినా మెరుగైన అవకాశాలు
- క్షణికావేశంలో ఏ నిర్ణయం తీసుకోవద్దు
- నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

పరీక్ష ఫెయిల్ అయ్యామనో, మార్కులు తక్కువగా వచ్చాయనో.. అనుకున్న ర్యాంకు రాలేదనో.. తనువు చాలించడం న్యాయమా..? క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు వల్ల కన్నవాళ్లకు కడుపుకోత మిగల్చడం ధర్మమా..? కష్టకాలాన్ని, ప్రతికూల పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలే తప్ప అఘాయిత్యాలకు పాల్పడటం ఎంత వరకు సబబు? బలవన్మరణం ఉత్తముల లక్షణం కాదు. నిలబడి పోరాడితేనే జీవితం ఉజ్వలంగా ఉంటుంది. ఒకసారి పరీక్ష తప్పితే నష్టమేమి లేదు.. మళ్లీ రాద్దాం..! ఉత్తమ ఫలితాలు సాధించి లక్ష్యం దిశగా అడుగులు వేద్దాం.. ఒక్కక్షణం ఆలోచించు..! ఈ జీవితం మీది.. పరీక్ష మళ్లీ రాయవచ్చు.. ఈ మార్కుల వల్ల జీవితమే మారిపోదు. పదో తరగతిలో ఫెయిల్ అయిన ఓ అమ్మాయి.. మళ్లీ పరీక్ష రాసి ఉత్తీర్ణురాలై.. ఆ తరువాత బంగారు పతకాలు సాధించింది. ఇలాంటి వారెందరో ఉన్నారు. ఓర్పుతో ఆలోచిస్తే పరిష్కారం మీ చేతుల్లో ఉంది.

కర్నూలు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఇంటర్మీడియట్ బోర్డు శనివారం ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు విడుదల చేయనుంది. ఈమేరకు సన్నాహాలు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఫలితాల కోసం 45,325 మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. మార్చి ఒకటో తేదీ నుంచి 18వ తేది వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెట్, ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ఫస్ట్ ఇయర్) విద్యార్థులు 22,207 మంది, రెండవ సంవత్సరం (సెకండ్ ఇయర్) విద్యార్థులు 23,098 మంది పరీక్షలు రాశారు. మరికొన్ని గంటల్లో రానున్న ఫలితాల కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. కన్నవాళ్లు సైతం తమ పిల్లల ఉత్తీర్ణత తెలుసుకోవాలని నిరీక్షిస్తున్నారు. తమ పిల్లలు ఉత్తీర్ణత ఫలితాలు తెలుసుకోవడం మంచిదే. ఏ కారణం చేతనో అనుకున్న ఫలితాలు రానప్పుడు తమ పిల్లలు ధైర్యం చెప్పాల్సి బాధ్యత కన్నవాళ్లపై ఉంది. అదే క్రమంలో విద్యార్థులు కూడా ఉండిపోకూడదు.

తల్లిదండ్రుల బాధ్యత


- విద్యార్థులు పరీక్షల్లో విఫలమైతే వారికి మద్దతుగా నిలవడం తల్లిదండ్రుల బాధ్యత. పిల్లలు ఒత్తిడికి గురికాకుండా అండగా నిలబడాలి. భవిష్యత్తులో ఎన్నో విజయాలు సాధించవచ్చని ప్రోత్సాహించాలి.
- ఫలానా విద్యార్థి మంచి ర్యాంకుతో ఉత్తీర్ణత సాధించాడనో.. పక్కింటి పిల్లలు మంచి మార్కులు తెచ్చుకున్నారనో.. తమ పిల్లలను తక్కువ వేసి వేరేవాళ్ల పిల్లలను గొప్పగా చూపడం చేయకూడదు.
- పరీక్షా ఫలితాలు వచ్చిన తర్వాత పిల్లలతో మాట్లాడాలి. ఆహ్లాదకర ప్రదేశాలకు తీసుకెళ్లి వారిలోని ఒత్తిడిని తగ్గించాలి.
- పిల్లలకు ఆరోగ్యకరమైన, ప్రశాంత వాతావరణ కల్పించాలి. ఒత్తిడి గురైనట్లు గుర్తిస్తే.. వారికి ధైర్యం ఇవ్వాలి. వాళ్లతోనే ఎక్కువ సమయం గడపాలి.
- పిల్లల తప్పులు ఎత్తిచూపి శిక్షించకుండా వారికి ప్రోత్సాహం అందించాలి. స్నేహితుల్లా చేయూత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
- తమ పిల్లలు ఉత్తమ ఫలితం సాధించాలని ఆశించడం సహజం. వారి ప్రయత్నాలను కూడా అభినందించాలి.
- విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాలను నిర్ణయించడంతో గురువులుగా, తల్లిదండ్రులుగా సహాయపడాలి.
- కన్నవాళ్లు తమ పిల్లల పట్ల చురుకైన పాత్ర పోషించడం ద్వారా వారు విజయం వైపు పరుగులు పెట్టేందుకు సహాయపడవచ్చు.
- పరీక్షా తప్పినా.. మార్కులు తక్కువగా వచ్చినా భయపడాల్సిన అవసరం లేదు. ఆ సమయంలో మీలో వచ్చే ఆలోచనలు అమ్మానాన్నలు, మిత్రులు, శ్రేయోభిలాషులతో పంచుకోండి.
- ఇప్పుడు పరీక్షా తప్పితే కొన్ని రోజుల్లోనే సప్లిమెంటరీ పరీక్షలు ఉన్నాయి.. మార్కులు తక్కువ వస్తే ఇంప్రూవ్‌మెంట్ రాసుకోవడానికి అవకాశం ఉంది. సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితం సాధించే అవకాశం ఉంది

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి



పరీక్షా ఫలితాలు సమయంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకం. తోటి విద్యార్థుల కంటే తక్కువ మార్కులు వచ్చినా, అనుకున్న మార్కులు సాధించలేకపోయినా కొందరు విద్యార్థులు డిప్రెషన్‌కు లోనవుతుంటారు. అలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిరాశ, ఆందోళన, దుఃఖం వంటి భావోద్వేగాలకు పిల్లలు లోనుకాకుండా చూసుకోవాలి. వారి ప్రవర్తనలో ఏదైనా మార్పులు గమనిస్తే వారికి ధైర్యం కల్పించడంతో పాటు భవిష్యత్తులో విజయాలెన్నో అందుకునే శక్తి నీకుందంటూ ప్రోత్సాహం అందించాలి. వారికి అన్ని రకాలుగా సహాయంగా నిలబడాలి. విద్యార్థులు కూడా మానసిక ఆందోళనకు గురికాకూడదు. భయం వేసినా, బాధేసినా అమ్మనాన్నలతో పంచుకోవాలి. మరీ ఇబ్బందిగా ఉన్నప్పుడు వైద్యనిపుణులను సంప్రదించడం ఉత్తమం.

– డాక్టర్ ఎం.శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, జీజీహెచ్, కర్నూలు



పత్తి ఓబులయ్య, ఎస్‌డీవీ అజీజ్‌లకు ఘనంగా సత్కారం


పత్తి ఓబులయ్యను సత్కరిస్తున్న ప్రజా వేదిక సంస్థ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉగాది వేడుక రోజున రాష్ట్ర ప్రభుత్వం నుంచి కళారత్న (హంస) పురస్కారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకున్న టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, విద్వాన్ పత్తి ఓబులయ్యను, అదే రోజున సాహిత్యరంగంలో ఉగాది విశిష్ట పురస్కారం అందుకున్న కర్నూలుకు చెందిన చారిత్రక నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్‌లను శుక్రవారం రాత్రి ఘనంగా సత్కరించారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలోగల సాహితీ వేదికపై ప్రజా వేదిక సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా వేదిక కన్వీనర్ మురళీమోహన్ మాట్లాడుతూ ప్రజావేదిక ప్రజాహిత కార్యక్రమాల నిర్వహణకు స్థాపించారని గుర్తు చేశారు. అందులో భాగంగా కళారంగానికి, సాహితీ రంగానికి సేవలు అందిస్తున్న పత్తి ఓబులయ్య, ఎస్‌డీవీ అజీజ్‌లకు రాష్ట్రస్థాయి పురస్కారాలు లభించడం అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు వెంకటస్వామి, బడే సాహెబ్, మహమ్మద్ మియా, కె. బాలవెంకటేశ్వర్లు, వేదిక సభ్యులు, పలువురు కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.


ఎస్‌డీవీ అజీజ్‌ను సత్కరిస్తున్న ప్రజా వేదిక సంస్థ ప్రతినిధులు

మనసారా నవోదయం..!

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర విభజన తర్వాత నాటి టీడీపీ ప్రభుత్వం సారా నిర్మూలన కోసం నవోదయం అమలు చేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కూడా పరివర్తన కార్యక్రమం చేపట్టింది. జిల్లాలో 55 గ్రామాలను గుర్తించారు. 30 గ్రామాలను 'సారా రహిత గ్రామాలు'గా ప్రకటించారు. ఆయా గ్రామాల్లో 60 మంది నాటుసారా తయారీ, అమ్మకందారులకు రూ.54 లక్షలకు పైగా ఖర్చు చేసి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించారు.

సారా రహిత కర్నూలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



సారా నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో 110 గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో సారా తయారీ, అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించాం. ఆయా గ్రామాల్లో 500 మంది తయారీ, అమ్మదారులు ఉన్నారని గుర్తించాం. వారిలో పరివర్తన తీసుకొచ్చేందుకు ఇప్పటికే జిల్లాలో అవగాహన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాం. మరో వైపు దాడులు కూడా చేస్తున్నాం. పోలీస్, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు, సిబ్బందితో ఎక్సైజ్ యంత్రాంగం సమన్వయం చేసుకొని నవోదయం 2.0 పక్కాగా అమలు చేసి సారా రహిత కర్నూలు జిల్లాను మార్చాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. సారా తయారీ, అమ్మకాలు సంపూర్ణంగా మానేసే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా సంపూర్ణ సహకారం అందించాలి.

– ఎం.సుధీర్‌బాబు, సూపరింటెండెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, కర్నూలు

ఎక్సైజ్ సిబ్బంది దత్తత

కర్నూలు జిల్లాలో నాటుసారా తయారీ, అమ్మకాలు సాగిస్తున్న 110 గ్రామాలను సంబంధిత ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో పని చేసే సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లకు ఒక్కొక్కరికి ఒక్కో గ్రామం దత్తత ఇచ్చేలా ప్రణాళికలు తయారు చేశారు. అదే క్రమంలో ఇతర గ్రామాలను కూడా సిబ్బందికి దత్తత ఇస్తారు. ఆయా గ్రామాల్లో ఎక్సైజ్ నేరాలు జరిగితే అందుకు దత్తత ఇచ్చిన కానిస్టేబుల్‌పై శాఖ పరమైన చర్యలు తీసుకుంటారు. దీనిని రికార్డులకు పరిమితం కాకుండా పక్కాగా అమలు చేస్తే నాటుసారా రహిత గ్రామాలుగా మార్చే అవకాశం ఉంది.

టోల్ ఫ్రీ నంబరు 14405

ఏ గ్రామంలోనైనా నాటుసారా తయారీ, అమ్మకాలు చేస్తున్నా, అనుమతి లేని కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మద్యం విక్రయాలు సాగిస్తుంటే టోల్ ఫ్రీ నంబరు. 14405కు కాల్ చేస్తే ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందిస్తారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు, ఎక్కువ రేట్లకు మద్యం అమ్మకాలు చేసినా ఈ నంబరుకు కాల్ చేయవచ్చు.

ఎక్సైజ్ స్టేషన్ల వారీగా నాటుసారా తయారీ, అమ్మకాలు చేస్తున్న గ్రామాల వివరాలు

నియోజకవర్గం	ఏ-కేటగిరీ	బీ-కేటగిరీ	సీ-కేటగిరీ	మొత్తం
కర్నూలు	5	6	21	32
కోడుమూరు	2	2	14	18
ఆదోని	9	--	1	10
ఆలూరు	4	2	1	7
ఎమ్మిగనూరు	--	2	--	2
కోసిగి	--	4	2	6
పత్తికొండ	5	9	21	35
మొత్తం	25	25	60	110


ఆదోనిలో సారా నిర్మూలన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు

నాటు సారా కనిపించకూడదు

- బెల్లం సరఫరాదారులపై కేసులు పెట్టండి
- ఉమ్మడి జిల్లా సీఐలు, ఎస్ఐలకు ఎక్సైజ్ డీసీ ఆదేశం



సీఐలతో సమీక్షిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నాటు సారా ఒక్క చుక్క కూడా కనిపించకూడదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి. శ్రీదేవి ఆదేశించారు. శుక్రవారం నగరంలోని జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ చాంబర్లో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల ఎక్సైజ్ సీఐలతో అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావుతో కలిసి డిప్యూ టీ కమిషనర్ సమీక్షించారు. నవోదయం-02 కార్యక్రమాన్ని ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అందుకు తగ్గట్టుగా అందరూ బాధ్యతతో పని చేయాలని సూచించారు. నాటు సారా తయారీదారులు, అమ్మకం దారులతో పాటు బెల్లం సరఫరాదారులపై కూడా కేసులు నమోదు చేయాలన్నారు. వారిపై బైండోవర్ కేసులు పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో ఉమ్మడి జిల్లాల సూపరింటెండెంట్లు ఎం సుధీర్ బాబు, రవికుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు రామకృష్ణారెడ్డి, రాజశేఖరగౌడ్, వి. రాముడు, సీఐలు పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించాలి

క్రీడాకారిణి జఫ్రిన్‌ను అభినందించిన జేసీ డాక్టర్ బి. నవ్య


షేక్ జఫ్రిన్‌ను అభినందిస్తున్న జేసీ డాక్టర్ బి. నవ్య

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నవంబర్ 2025లో జరిగే ఒలింపిక్స్ క్రీడల్లో క్రీడాకారిణి షేక్ జఫ్రిన్ గోల్డ్ మెడల్ సాధించి, రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య ఆకాంక్షించారు. గత నెల 20 నుంచి 23 వరకు న్యూఢిల్లీలోని ఆలిండియా స్పోర్ట్స్ కౌన్సిల్ ఆఫ్ డెఫ్ ఆధ్వర్యంలో గుజరాత్ రాష్ట్రంలోని అహమ్మదాబాద్‌లో జరిగిన నేషనల్ గేమ్స్ (నేషనల్ డెఫ్ సీనియర్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ 2025) పోటీల్లో సింగిల్స్ అండ్ మిక్స్ డబుల్స్ విభాగాల్లో కర్నూలు డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న షేక్ జఫ్రీన్ 2 గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం కర్నూలులోని డీసీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిథిగా జేసీ బి. నవ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి, డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి షేక్ జఫ్రీన్‌ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు

పెన్షనర్ల కోసం 'హెల్ప్‌లైన్'

కర్నూలు లీగల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రెండు హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేశారు. ఈమేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సబ్ ట్రెజరీలలో పెన్షన్ల చెల్లింపులో జాప్యం, అవినీతి మూలంగా పెన్షనర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గతంలో పత్రికల్లో వార్తా కథనాలు వచ్చాయి. దీనిపై రాష్ట్ర లోకాయుక్త సుమోటోగా స్పందించి, ఈ ఆరోపణలపై విచారించేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. అయితే ట్రెజరీ అధికారుల జాప్యం, అవినీతి ఆరోపణలకు తగిన సాక్షాధారాలు ఏమీ లేవని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కొన్ని చర్యలు తీసుకుంటున్నట్లు విచారణ కమిటీ లోకాయుక్తకు తెలియజేసింది. పెన్షనర్ల సహాయార్థం హెల్ప్ నెంబర్లు 63009 68380, 98493 88295లకు తమ సమస్యలను తెలియజేయాలని, ఒక కోఆర్డినేటర్ కమిటీని ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు విచారణ కమిటీ లోకాయుక్తకు తెలియజేసింది. దీంతో లోకాయుక్త ఈ కేసును మూసివేస్తున్నట్లు లోకాయుక్త రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

మల్లన్న సేవలో ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్

శ్రీశైలం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డికి వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. తరువాత ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డి శ్రీశైలంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.


మలన్నను దర్శించుకున్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో యువకుల దుర్మరణం

- పులకుర్తి సమీపంలో ఢీకొన్న ఆటో, బైకు
- మృతులు గోనెగండ్ల మండలం అల్వాల వాసులు



మృతిచెందిన హర్ష, జయరాజు(ఫైల్)

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులకుర్తి గ్రామ శివారులో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. గోనెగండ్ల మండలంలోని అల్వాల గ్రామానికి చెందిన బోయ హర్ష (20), ఎం.జయరాజు (24) బైక్‌పై గూడూరుకు పని నిమిత్తం వెళ్లారు. అక్కడ పని ముగించుకుని మధ్యాహ్నం తిరుగు పయనమయ్యారు. అయితే పులకుర్తి సమీపంలో చిన్న కాలువ దగ్గర కాకరకాయల సంచులతో గూడూరుకు వెళ్తున్న ఆటో, బైకు ఢీకొన్నాయి. దీంతో బైక్ ఉన్న ఇద్దరూ రోడ్డు పక్కన పొదల్లోకి ఎగిరి పడ్డారు. హర్ష అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన జయరాజును 108లో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంతో మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. పోలీసులు హర్ష మృతదేహాన్ని కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జయరాజు మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. జయరాజుకు భార్య సజీవ, ఐదునెలలు, రెండేళ్ల వయసున్న కుమారులు ఉన్నారు. జయరాజు డ్రైవర్‌గా పని చేసేవాడు. జయరాజు మృతితో ఇంటి పెద్దదిక్కు కోల్పోయింది.

వలస వెళ్లి స్వగ్రామానికి వచ్చిన హర్ష

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి హృదయవిదారకరంగా మారింది. అల్వాలకు చెందిన బోయ శంకరమ్మ, నాగన్న దంపతులకు కొడుకు హర్ష, కూతురు సంతానం. కూలీ పనులతో జీవనం గడుపుతోంది. కొన్ని రోజుల క్రితం కుటుంబమంతా గుంటూరుకు వలస వెళ్లారు. అయితే రెండు రోజుల క్రితం హర్ష ఒక్కడే గ్రామానికి చేరుకున్నాడు. వలస నుంచి తల్లిదండ్రులు శుక్రవారం మధ్యాహ్నం గ్రామానికి చేరుకున్నారు. వచ్చిన కొద్దిసేపటికే కొడుకు ప్రమాదానికి గురయ్యాడని తెలిసి తల్లడిల్లిపోయారు.

ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తి మృతి

- వాహనం కింద సేదతీరుతున్న కూలీ
- గమనించకుండా డ్రైవర్ రివర్స్ చేయడంతో ప్రమాదం

మిడుతూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలూటి గ్రామంలో నాపరాతి గనుల వద్ద టాక్టర్ రివర్సు చేస్తుండగా వెనకాల కూర్చున్న అల్లబకాస్(55)పై ఎక్కడంతో మృతి చెందాడు. వివరాలివీ.. అల్లబకాష్ శుక్రవారం మధ్యాహ్నం నాగలూటి గ్రామంలోని నాపరాతి గనిలో రోజువారిగా కూలీ పనులకు వెళ్లాడు. అక్కడ పని చేసి దాహం తీర్చుకుని నాపరాళ్లకోసం వచ్చి ఆగి ఉన్న ట్రాక్టర్ కింద కూర్చున్నాడు. అల్లబకాష్‌ను గమనించకుండా డ్రైవర్ ట్రాక్టర్‌ను రివర్సు చేయడంతో అల్లబాకాస్ మీద ఎక్కింది. చుట్టు పక్కల వాళ్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో కర్నూలుకు తరలించారు. అయితే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అల్లబకాష్ మృతి పట్ల అతని భార్య మాసుంబి మిడుతూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పొగాకు రైతులు దగా

- సాగుకు ముందే కొంటామన్న కంపెనీలు
- దిగుబడి వచ్చాక కొనుగోలుకు అడ్డగోలు నిబంధనలు
- పెరిగిన సాగు విస్తీర్ణం - ఆశాజనకంగా దిగుబడి
- రూ.15వేల నుంచి రూ.5వేలకు పడిపోయిన ధరలు



కోవెలకుంట్ల కొనుగోలు కేంద్రానికి వచ్చిన పొగాకు బేళ్లు.. తూకం వేస్తున్న సిబ్బంది

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో పొగాకు రైతులను కంపెనీలు దగా చేశాయి. సాగుకు ముందు పొగాకు కొనుగోలుకు హామీ ఇచ్చి, విత్తనాలు అందించి మరీ అన్నదాతలను ప్రోత్సహించిన కంపెనీలు, దిగుబడి వచ్చాకు కొనుగోలు చేయడానికి అడ్డగోలు నిబంధనలు పెడుతున్నాయి. దీంతో అన్నదాతలు లబో దిబోమంటున్నారు. గతేడాది పొగాకు సాగు అన్నదాతలకు లాభాలు కురిపించడంతో ఈ ఏడాది మరింత ఆశతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా పొగాకు సాగు చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఉమ్మడి జిల్లాలో మూడింతలకు పైగా అధికంగా పొగాకు సాగైంది. మరోవైపు దిగుబడి కూడా గతేడాదికన్నా అధికంగా వచ్చినట్లు అన్నదాతలు పేర్కొంటున్నారు. గత సంవత్సరం కర్నూలు జిల్లాలో రైతులు పొగాకు 9586 ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది 36,471 ఎకరాల్లో సాగుచేశారు. నంద్యాల జిల్లాలో గతేడాది 8791 ఎకరాల్లో సాగుచేయగా, ఈఏడాది 30,865 ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. మొత్తం ఉమ్మడి జిల్లాలో 67,336 ఎకరాల్లో రైతులు పొగాకు చేసినట్లు వ్యవసాయ శాఖ లెక్కల ద్వారా తెలుస్తోంది. కాగా గత సంవత్సరం పొగాకుకు విపరీతమైన డిమాండ్ ఏర్పడటంతో కంపెనీలు రైతుల వద్దకు వచ్చి క్వింటాలు రూ.15వేల నుంచి 16,500ల వరకు కొనుగోలు చేశారు. దీంతో అన్నదాతలు మూడింతలు అధికంగా పొగాకు సాగు చేశారు. అయితే ఈ ఏడాది పొగాకు కొనుగోళ్లకు కంపెనీలు కొర్రీలు పెడుతున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. రైతులు కంపెనీల వద్దకే పొగాకు తీసుకవెళ్లి అమ్ముకుంటున్నారు. దీంతో వారు ఇష్టానుసారంగా ధరలు చెల్లిస్తూ రైతులను దోచుకుంటున్నారు. క్వింటాలుకు రూ.5000, నుంచి రూ.6500 మించి ధర పలకడంలేదని రైతులు వాపోతున్నారు.

జిల్లాలోని కోవెలకుంట్ల, బనగానపల్లె, నందికొట్కూరు, నంద్యాల తదితర ప్రాంతాల్లో కంపెనీలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాయి. దీంతో రవాణా ఖర్చులను భరించి, అంత దూరం తీసుకెళ్లాక నాణ్యత లేదని, తడిసిపోయిందని కంపెనీలు ధరల్లో కోత కోస్తున్నాయి. కొంతమంది రైతుల పొగాకు కొనకుండా వెనక్కి పంపుతున్నాయి. ప్రభుత్వం జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని పొగాకు రైతులు కోరుతున్నారు.

జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

- నంద్యాల కలెక్టర్ రాజకుమారి


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం డిస్ట్రిక్ ఇండస్ట్రియల్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు కల్పించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పెట్టుబడి రాయితీ, పావలావడ్డీ, విద్యుత్, సేల్ ట్యాక్స్ తదితర రాయితీల కింద జిల్లాలో ఉత్పాదన, సేవా రంగాల్లోని 24 యూనిట్లకు 1.67కోట్ల విలువైన రాయితీ ప్రయోజనాలు మంజూరు చేశామని చెప్పారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి గత త్రైమాసికంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులకోసం పది దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సింగల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 8పరిశ్రమలకు అనుమతులు మంజూరయ్యాయని, మిగిలిన రెండు దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెఇలపారు. వాటిని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం జవహర్‌బాబు, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, ఎల్‌డీఎం రవీంద్రకుమార్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన డ్రైనేజీ వివాదం

ఓర్వకల్లు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నన్నూరు గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన డ్రైనేజీ వివాదం ఓ వ్యక్తి మరణానికి దారితీసింది. వివరాలివీ.. బస్టాండు వద్ద ఉన్న సచివాలయం సమీపంలో నివాసముంటున్న అల్లనగరి నాగరాజు, బత్తి వెంకటరాముడు కుటుంబాల మధ్య ఇళ్ల ముందు ఉన్న డ్రైనేజీ కాలువ విషయంలో కొంత కాలంగా వివాదం ఉంది. శుక్రవారం వీరిద్దరి మధ్య ఇదే సమస్యపై వాదోపవాదాలు జరిగాయి. ఈ క్రమంలో అల్లనగరి నాగరాజు(50) అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాగరాజుకు భార్య లలిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పెద్దాసుపత్రి వద్ద ట్రాఫిక్ ప్రక్షాళన

- వ్యాపారులతో అధికారుల చర్చలు


వ్యాపారులతో మాట్లాడుతున్న సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఎదురుగా ఉన్న దుకాణాలను తొలగించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన నగర పాలక అధికారుల సమావేశంలో మంత్రి టీజీ భరత్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా దుకాణాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు నగర పాలక సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ అధ్వర్యంలో శుక్రవారం సంబంధిత వ్యాపారులతో చర్చలు జరిపారు. ఫుట్‌పాత్‌పై దుకాణాలు ఉండరాదని హెచ్చరించారు. వీటి వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతున్నదని, తక్షణమే మంత్రి ఆదేశాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. అయితే ఒక్కరోజు గడువు ఇస్తే దుకాణాలను తొలగిస్తామని వ్యాపారులు అధికారులకు విన్నవించారు.

మొక్కజొన్న దగ్ధం

- రైతులకు రూ.10 లక్షలు నష్టం


మంటలను అదుపులోకి తెస్తున్న ఫైర్ సిబ్బంది

ప్యాపిలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జలదుర్గం గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో 8ఎకరాల్లో మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతైంది. దాదాపు రూ.10లక్షల నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన రైతులు బాలరంగయ్య, శివకుమార్, రాజశేఖర్, రాధాక్రిష్ణ, చంద్రుడు పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. ఒక్కో రైతు రెండు నుంచి మూడు ఎకరాల వరకు మొక్కజొన్న సాగు చేశారు. పంట కూడా కోత దశకు వచ్చింది. ప్రమాదవశాత్తు పంటకు నిప్పు అంటుకుంది. డోన్ ఫైరింజన్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. 8 ఎకరాల్లో పంట అగ్నికి ఆహుతైంది. ఒక్కో రైతుకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లింది. అప్పులు చేసి పంటను సాగు చేశామని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

ఓర్వకల్లు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40 పై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలివీ.. గడివేముల మండలం బిలకలగూడూరు గ్రామానికి చెందిన పోతురాజు మధు, పోతురాజు శ్రీనివాసులు నన్నూరులో వివాహం ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. స్థానిక బైరెడ్డి కాలనీ సమీపంలో బైకు ముందు వెళుతున్న కారును ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను టోల్‌ప్లాజా అంబులెన్సులో కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

'ఫెయిల్' భయం.. ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న సుదీశ్వర రెడ్డి

బండిఆత్మకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అవుతానని భావించి భయపడిన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన బండిఆత్మకూరు మండలంలోని ఏ.కోడూరులో శుక్రవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏ.కోడూరు గ్రామానికి చెందిన వెంకట సుబ్బారెడ్డి కుమారుడు వెంకట సుదీశ్వరరెడ్డి (16) నంద్యాలలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవలే పరీక్షలు పూర్తి చేసుకున్న సుదీశ్వర రెడ్డి కొంతకాలంగా ముభావంగా ఉండేవాడు. ఈ క్రమంలో శనివారం ఫలితాలు విడుదల అవుతాయని తెలుసుకున్న యువకుడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫెయిల్ అయితే ఇంటా, బయటా అవమాన పాలవుతానని భావించిన సుదీశ్వర రెడ్డి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పులు అధికమై బలవన్మరణం

దేవనకొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, అప్పు ల భారంతో జీవితం పై విరక్తి చెంది దేవనకొండకు చెందిన తలారి లక్ష్మన్న (41) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. లక్ష్మన్న రెండు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. గొర్రెపిల్లల కొనడానికి చేసిన అప్పులు రూ. 5 లక్షలకు చేరాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉదయం బైరవానికుంట ఆంజనేయస్వామి ఇనాం భూమిలో చెట్టుకు ఉరేసుకున్నారు. లక్ష్మన్న భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

గోనెగండ్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐరన్ బండ గ్రామా నికి చెందిన గొల్ల రామాంజనేయులు (42) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. రామాంజనేయులుకు భార్య వీరేషమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. 1.65 ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. అన్న వెంకటేశ్వర్లకు ఉన్న నాలుగు ఎకరం పొలాన్ని కూడా కౌలుకు తీసుకొని గత 8 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. మూడేళ్ల నుంచి పత్తి, మిరప, ఉల్లి, వేరుశనగ పంటలు సాగు చేశారు. దీనికి తోడు ఈ ఏడాది తనపొలంలో మిరప, ఉల్లి, వేరుశనగ పంటలు సాగు చేశాడు. మిరపకు వైరస్ సోకడంతో పంట పూర్తిగా దెబ్బతింది. ఉల్లి, వేరుశనగ పంటలు సరిగా పండలేదు. గత మూడేళ్లుగా చేసిన అప్పు వడ్డీతో కలిపి సుమారు రూ. 10 లక్షలకు చేరింది. అప్పు ఎలా తీర్చాలోనన్న మనస్తాపంతో ఈనెల 10న ఇంట్లో ఎవరూ లేని సమయంలో రామాంజనేయులు పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన కర్నూలు ప్రభుత్వ ఆసుప త్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్ర వారం మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


జిల్లా పరిషత్‌లో జ్యోతిబా పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు


ఓర్వకల్లులో...


నగర పాలక కార్యాలయంలో జ్యోతిబా పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి


ఉప కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రధాన కూడళ్లలో కార్మికుల అడ్డాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక శాఖ ఉప కమిషనర్ కే. వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. నల్లన్న మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులు వడదెబ్బకు గురికాకుండా కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి నల్లన్న, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్, రామాంజనేయులు, ఇర్మియా, తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయిలు అన్నిరంగాల్లో రాణించాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిలు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత సూచించారు. శుక్రవారం దూపాడులోని అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. గౌరు చరిత మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో మహిళలు రాణిస్తూ దేశాభివృద్ధిలో కీలకభూమిక పోషిస్తున్నారని అన్నారు. కళాశాల ఈ-క్యూబ్ కార్నివాల్ -2025లో కళాశాల యాజమాన్యం చేపట్టిన వివిధ రకాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల అధినేత అశోకవర్ధన్ రెడ్డి, సీఈవో డా.హరిక్రిష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఏఐకేఎస్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో సీపీఐ నగర కార్యదర్శి సి. మహేష్ అధ్యక్షతన నిర్వహించిన దినోత్సవంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే. జగన్నాథం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సీపీఐ నగర కార్యదర్శి పి. రామక్రిష్ణారెడ్డి, నాయకులు పుల్లన్న, బాషా, నాగరాజు పాల్గొన్నారు.

అనస్థీషియా టెక్నీషియన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎస్. దినేష్



కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అనస్థీషియా ఎంప్లాయిస్ టెక్నీషియన్ రాష్ట్ర కార్యదర్శిగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన ఎస్. దినేష్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కోశాధికారి గా నంద్యాల జీజీహెచ్‌కు చెందిన ఆర్.వినోద్, ఈసీ సభ్యులుగా అమర్‌యాదవ్ ఎన్నికైయ్యారు. ఈ మేరకు విజయవాడలో శుక్రవారం అనస్థీషియా టెక్నీషియన్ ఎంప్లాయిస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఒంగోలుకు చెందిన డి. వెంకటేశ్వర్లు రాష్ట్ర అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా ఎస్.దినేష్, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దినేష్ మాట్లాడుతు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న అనస్థీషియా టెక్నీషియన్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు.

రాయల పట్టాభిషేక మహోత్సవాన్ని అధికారిక జాబితాలో చేర్చాలి

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక కార్యక్రమాల జాబితాలో శ్రీకృష్ణదేవరాయల జయంతి, పట్టాభిషేక మహోత్సవం, వర్ధంతి లేకపోవడం శోచనీయమని నగర బలిజ సంఘం అధ్యక్షులు గాండ్ల లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి మండ్లె రవికుమార్, గౌరవాధ్యక్షులు పత్తి ఓబులయ్య, ప్రధాన సలహాదారులు సింగంశెట్టి సోమశేఖర్ అన్నారు. శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక మహోత్సవాన్ని క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఉన్నత విద్యను ప్రక్షాళన చేయండి

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యామండలిని ప్రక్షాళన చేయాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాయలసమీ పరిరక్షణ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, ఎస్ఎఫ్ఐ వర్సిటీ కన్వీనరు రామక్రిష్ణ, ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగార్జున మాట్లాడారు. ఉన్నత విద్యామండలిపై యకోన శశిధర్, భరత్ గుప్తాల పెత్తనంతో వర్సిటీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయని మండిపడ్డారు. నూతన ఫైనాన్స్ ఇయర్ మొదలై నెల రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు వర్సిటీల వార్షిక బడ్జెట్ ఆమోదం కోసం పాలక మండలి సమావేశాలు నిర్వహించకుండా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. సమావేశంలో నాయకులు మౌలాలి, బాలాజీ నాయక్, ఓబేలేష్, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్ట సవరణ బిల్లును తక్షణమే కేంద్ర ప్రభుత్వము వెనక్కి తీసుకోవాలని జేఏసీ ప్రజాసంఘాల కన్వీనర్ జాకీర్ మౌలానా రషీద్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని వివిధ మసీదుల ముందు మానవహారం నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ వక్ఫ్ చట్ట సవరణపై కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం కేవలం ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో బిల్లును తీసుకువచ్చిందన్నారు. ఆవాజ్ కమిటీ నగర అధ్యక్షుడు పి.ఇక్బాల్ హుస్సేన్, నగర కార్యదర్శి ఎస్ఎండి.షరీఫ్, అబ్దుల్‌దేశాయ్, ఖలీల్ అహ్మద్, జమాతే ఇస్లాం నాయకులు మునీర్ అహ్మద్ పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి 'పూలే'

- ●జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి
- ●ఘనంగా జ్యోతిబా పూలే జయంతి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే అని, ఆయన స్ఫూర్తితో అసమానతలను తొలగించి సమసమాజ నిర్మాణంలో యువత ముందుకు పోవాలని జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి అన్నారు. పూలే 198వ జయంతి వేడుకలను శుక్రవారం జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘ నంగా నివాళులర్పించారు. జి.నాసరరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి సాధికారత కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో పరిపాలన అధికారులు సరస్వతి, కే.జితేంద్ర, పుల్లయ్య, ఉద్యోగులు రామచంద్ర మూర్తి, మహ్మద్ హక్, సిద్దారెడ్డి, సురేష్, పుష్పావతి, మాధవి, తిరుమలేశ్వరరెడ్డి, కళ్యాణి, లచ్చన్న. క్రిష్ణారావు పాల్గొన్నారు.

● సామాజిక దర్శనికుడు జ్యోతిబా పూలే అని నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి. కృష్ణ అన్నారు. నగర పాలక కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, టీపీఆర్‌వో వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు సుబ్బన్న, రామక్రిష్ణ, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వి.మోహన్‌రెడ్డి బిర్లాగేట్ సమీపంలోని మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఏపీ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్, నగర అధ్యక్షురాలు జయమ్మ కేకే భవన్ ఆవరణలోని ఐలమ్మ కార్యాలయంలో పూలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్.శ్రీనివాసులు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

● జ్యోతిబా పూలే 198వ జయంతి వేడుకలను ప్రజాపరిరక్షణ సమితి కార్యలయంలో ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు బలరాం పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పద్మానందయోగి, డేవిడ్, మురళి, రవికుమార్, సూర్యప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో ..

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బీసీ సెల్ అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు అధ్వర్యంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శుక్రవారం జ్యోతిబా పూలే 198వ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు నంద్యాల నాగేంద్ర, ధరూర్ జేమ్స్, బేతం క్రిష్ణుడు, హనుమంతరావు చౌదరీ పాల్గొన్నారు.

●జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షులు షేక్ జీలానీ బాషా జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, దామోదరం రాధకృష్ణ, బజారన్న, షేక్ ఖాజా హుసేన్, మహిళా నాయకురాళ్లు వెంకట సుజాత, ప్రమీల, అనంతరత్నం మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

● బిర్లా గేట్ కూడలిలో ఉన్న జ్యోతిబా పూలే విగ్రహానికి బేడ,బుడగ జంగాల ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలేకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు తూర్పాటి మనోహర్, కోమ్ముపల్లె శ్రీనివాసులు, జీవీ కృష్ణయ్య, గడ్డం రామక్రిష్ణ, దూదేకుల సమీల్లుల పాల్గొన్నారు.

● డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి ఇన్‌చార్జీ ఉపకులపతి ప్రొఫెసర్ పీఎస్‌షావలీ ఖాన్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ లోక్ నాథ్, ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మహబూబ్‌బాషా, కృపాకర్, ఎస్ఎస్ఎం హుస్సేనీ తదితరులు పాల్గొన్నారు.

● క్లస్టర్ యూనివర్సిటీలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జ్యోతిబా పూలే చిత్రపటానికి రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డీన్ అక్తర్ బాను, ఆధ్యాపకులు డాక్టర్ మహమ్మద్ వాహీద్, ఎల్లా కృష్ణ, అనూష, విమల, సవితా దేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

● రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎన్‌టీకే నాయక్, ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, డీన్ భరత్ కుమార్, వివిధ విభాగాల ఆచార్యులు, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లూరు: సమాజ నిర్మాణానికి కృషి చేసిన దార్శనీకుడు మహాత్మా జ్యోతిబా పూలే అని విద్యుత్‌శాఖ ఎస్ఈ యం.ఉమాపతి అన్నారు. శుక్రవారం విద్యుత్‌భవన్‌లో పూలే 198వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ ఓబులేసు, ఎస్ఏవో చిన్నరాఘవులు, కన్‌స్ట్రక్షన్, ట్రాన్స్‌పార్మర్స్ ఈఈలు మహేశ్వరరెడ్డి, లత, విజిలెన్స్ సీఐ నాగరాజుయాదవ్, టెక్నికల్ ఏడీఈ విజయభాస్కర్ అధికారులు పాల్గొన్నారు.

● కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.నాగేశాచలరెడ్డి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే 198వ జయంతి వేడుకలు ఘనంగటా జరిగాయి. శుక్రవారం బిసి.స్టడీసర్కిల్ సమీపంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కోడుమూరు: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంతో మండల అధికారుల ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలె జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంతో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం చేపట్టారు. ముందుగా జ్యోతిబా పూలె 198వ జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం మండల సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు మండలంలో జరుగుతున్న అభివృద్ధి అమలవుతున్న ప్రభుత్వ పథకాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రూతమ్మ, జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, ఎంపీడీవో రాముడు, డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు, వ్యవసాయ అధికారి రవిప్రకాశ్, మండల ఇంజనీర్ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండల పరిషత్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోఆర్డీ సుబ్బరాయుడు,ఆర్‌బ్ల్యూఎస్ ఏఈ యం.శ్రీనివాసులు, ఇంజనీరింగ్ సహాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


టీడీపీ కార్యాలయంలో


కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..


విద్యుత్‌భవన్‌లో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎస్ఈ ఉమాపతి


బేడ, బుడగ జంగాల ఆధ్వర్యంలో...

మాతాశిశు సంక్షేమమే దేశ సౌభాగ్యం


గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న జాయింట్ డైరెక్టర్ డా.అనిల్‌కుమార్

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంక్షేమమే దేశ సౌభాగ్యమని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డా.కేవీఎస్ఎస్.అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన నగరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రం కొత్తపేట వ్యాక్సిన్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవంతో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తగినంత పోషకాహారం తీసుకుంటే తల్లి, గర్భస్థ శిశువుకు సరైన శక్తి అందుతుందన్నారు. లేదంటే రక్తహీనత ఏర్పడుతుందన్నారు. నవజాత శిశు ఆరోగ్య సేవల ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. డీఎంఅండ్‌హెచ్ఓ శాంతికళ మాట్లాడుతూ తల్లి బిడ్డ ఆరోగ్య పరిరక్షణ కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యునిసెఫ్ కన్సల్టెంట్ నాగేంద్ర, డీపీఎంఓ డా.ఉమా, డీఐఓ డా.నాగప్రసాద్, డెమో శ్రీనివాసులు శెట్టి మెడికల్ ఆఫీసర్ డా॥శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జాతీయసురక్షిత మాతృత్వ దినోత్సవం నిర్వహించారు. సూపరింటెండెంటు డా.కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గర్భిణులు నెలల సమయంలో సరైన పరీక్షలు చేయించుకుని సుఖ ప్రసవం పొందాలన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డా.వెంకటేశ్వర్లు, గైనిక్ విభాగాపు హెడ్ డా॥శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం: జేసీ


గుడిపాడులో ఆర్వో ప్లాంటు తనిఖీ చేస్తున్న జేసీ నవ్య

గూడూరు (కోడుమూరు రూరల్), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జాయింట్ కలెక్టర్ నవ్య అన్నారు. శుక్రవారం గూడూరు మండలంలోని గుడిపాడు, మల్లాపురం, మునగాల గ్రామాల్లో రూ. 8లక్షలతో కుడా నిధులతో చేపట్టిన ఆర్వో ప్లాంటును జేసీ పరిశీలించారు.ఆర్వో ప్లాంటు ద్వారా సురక్షిత తాగునీరు అందుతుందని ఫ్లోరైడ్ ఇబ్బందులు ఉండవని జేసీ తెలిపారు. ఆర్వో ప్లాంటు ఏర్పాటుతో సురక్షిత తాగునీరు లభిస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజనేయులు, కుడా ఈఈ సురేష్, డీఈ నబిరసూల్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఏఈలు సనాచౌదరి, గోనె నాయక్, ఈవోఆర్డీ పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట


పాలకోవ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీఏ-పీడీ రమణారెడ్డి

కల్లూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని జిల్లా డీఆర్డీఏ-పీడీ రమణారెడ్డి అన్నారు. శుక్రవారం తడకనపల్లె గ్రామాన్ని ఆయన సందర్శించి 2025-26 సవంత్సరానికి సెర్ప్ ద్వారా ఆర్థిక ప్రణాళికను ఎన్యూమరేటర్ల ద్వారా గ్రామ సంఘాల్లో తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. పీడీ రమణారెడ్డి మాట్లాడుతూ మహిళలు వివిధ రకాల జీవనోపాధుల్ని చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి పథంలో పయనించాలన్నారు. అధికారులతో కలిసి గ్రామసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన జీవనోపాధులను పరిశీలించారు. తడకనపల్లె గ్రామంలో పాలకోవ కేంద్రాలు, సోలార్ డ్రైయ్యర్లు, పశువసతి కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. మహిళలు ఆనిధులను సక్రమంగా ఉపయోగించుకుని జీవనోపాధులు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐబి.డీపీఎం హజరత్, ఏసీ రెహమాన్, మండల సమాఖ్య అధ్యక్షురాలు జుబేదాబి, ఏపీఎం పుష్పావతి, సీసీలు, పొదుపు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మత్తు పనుల్లో భాగంగా నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి.శేషాద్రి తెలిపారు. రెండో శనివారం నగరంలోని సెంట్రల్ సెక్షన్, పవర్ సెక్షన్, సంతోష్‌నగర్, బళ్లారిరోడ్, ఓల్డ్‌టౌన్, బి.క్యాంపు సెక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ సెక్షన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈలు తెలిపారు. నగర ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠ పూజలు


పూజలు చేస్తున్న టీజీ వెంకటేశ్ దంపతులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌బాగ్ వద్ద తుంగభద్ర నదీతీరాన నూతనంగా నిర్మించిన సీతారాముల దేవాలయంలో రెండు రోజుల నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శాస్త్రోక్తంగా వేద పండితులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, టీజీ రాజ్యలక్ష్మి దంపతులు పాల్గొని పూజలు చేశారు. శనివారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు వేదపండితులు తెలిపారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

గూడూరు (కోడుమూరు రూరల్), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంచికలపాడులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కే. నాగలాపురం సుంకులాపరమేశ్వరీదేవి వార్షిక తిరుణాల వేడుకలను పురస్కరించుకుని కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశారు. స్థానిక జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్, దయ యూత్ అధ్వర్యంలో చేపట్టిన పోటీని ఎంపీటీసీ మద్దిలేటి ప్రారంభించారు. మొదటి మూడు జట్లకు రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేల చొప్పున దాతలు అందిస్తున్నారు.

నైపుణ్యాలను పెంచుకోవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు నైపుణ్యాలను పెంచుకోవాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి. నాగరాజు అన్నారు.జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్కూరు అధ్వర్యంలో 21వ సెంచురీ ఐఎఎస్ అకాడమి హైదరాబాద్ వారి సహకారంతో నగర శివారులోని కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో ఐఎఎస్ అకాడమీ ప్రతినిధి కృష్ణప్రసాద్, కేవీ విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ కన్న కుమార్, సెట్కూరు సూపరింటెండెంట్ శ్యామ్ బాబు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సి. బెళగల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలములోని క్రిష్ణదొడ్డి గ్రామంలో కోన వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రభోత్సవంతో ప్రారంభమైనట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 12న రథోత్సవం, 13న పారువేట, 14న వసంతోత్సవం, 15 బండలాగుడు పోటీలు స్వామివారి ఉత్సవాలు ముగిస్తాయని తెలిపారు. ఉత్సవాలకు జిల్లా నలుమూల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

అంబేడ్కర్ భవన్ ఆధునికీకరణ పనులు పరిశీలన

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో రాజ్‌విహార్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ రవీంద్రబాబు శుక్రవారం పరిశీలించారు. సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. 14న అంబేడ్కర్ జయంతి రోజున కలెక్టర్ పి. రంజిత్‌బాషా ఈ భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎంఈ సత్యనారాయలణ, డీఈఈ క్రిష్ణలత, ట్రైనీ ఏఈ మహేష్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో శుభ్రత పాటించాలి

కోడుమూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో శుభ్రత పాటించి రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆరోగ్యశాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వం ఆసుపత్రిని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం వార్డులను తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. ఎండ కాలం దృష్టిలో ఉంచుకొని ప్రతి వార్డులో రోగులకు ఏర్పాటు చేసిన ఫ్యాన్లు పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, దోమలు వృద్ధి చెందకుండా అవసరమైన జాగ్రత్తలు వహించాలని డాక్టర్ నాగరాజును ఆదేశించారు. కార్యక్రమంలో యూనిసెఫ్ కన్సల్టెంట్ నాగేంద్ర, జిల్లా నాణ్యత అధికారి ముర్తుజావలీ, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫారంపాండ్లతో భూగర్భ జలాలు వృద్ధి

ఓర్వకల్లు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పొలాల్లో ఫారం పాండ్లు తవ్వుకుంటే భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం సోమయాజులపల్లె గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో మద్దేశ్వరమ్మ, ఈసీ మధుశేఖర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎంయూ ధర్నా

కర్నూలు రూరల్ ఏప్రీల్ 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు 1,2డిపో ఎదుట శుక్రవారం రెండో రోజు ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్ఆర్ నాయుడు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి పీఎండీ ఇస్మాయిల్ పాల్గొన్నారు. మహిళ కార్మికులకు చైల్డ్‌కేర్ లీవ్‌లను మంజూరు చేసి బదిలీల ప్రక్రియను సక్రమంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులపై అధికారుల వేధింపు చర్యలను మానుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రసిడెంట్ పీఏవలి, రీజనల్ నాయకులు రంగన్న, మద్దయ్య, డిపోకార్యదర్శులు ఇసాక్,ఎంఎస్‌బీరెడ్డి గ్యారేజీ నాయకులు పాల్గొన్నారు.

సుంకులా పరమేశ్వరి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గూడూరు (కోడుమూరు రూరల్), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కే. నాగలాపురంలో వెలసిన సుంకులాపరమేశ్వరీదేవి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని పట్టువస్త్రాలు, ఆభరణాలతో ముస్తాబు చేశారు. సుగంధ పరిమళ పూలు, నిమ్మకాయల మాలలతో అలంకరించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రభపై కొలువుంచి మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ ఊరేగించారు. ప్రభోత్సవం పురస్కరించుకుని సాయంత్రం కర్నూలు కూచిపూడి కళానిలయం వారిచే నట్యప్రదర్శన చేపట్టారు. శనివారం సాయంత్రం అమ్మవారి రథోత్సవం జరుగనుంది. కార్యక్రమంలో ఈవో నరసయ్య, సిబ్బంది కేశవ, పెద్దలు సురేష్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కుందూకు జలకళ



ఓర్వకల్లు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఓర్వకల్లు మీదుగా ప్రవహిస్తున్న కుందూ వాగు గురువారం రాత్రి కురిసిన వర్షంతో జలకళతో కళకళలాడుతోంది. కర్నూలు జిల్లా వ్యాప్తంగా భారీ ఉరుములు, మెరుపులతో కురిన వర్షంతో పరివాహక ప్రాంతం నుంచి వర్షపు నీరు భారీగా చేరింది. దీంతో కుందూ వాగు నీటితో పొంగి పొర్లుతోంది.

పోలీసులను దూషిస్తే పుట్టగతులుండవు

● మాజీ సీఎం జగన్‌పై వైకుంఠం ఆగ్రహం


ఆస్పరికి వస్తున్న వైకుంఠం శివప్రసాద్, కప్పట్రాళ్ల బొజ్జమ్మ

ఆస్పరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలను కాపాడేందుకు పనిచేసే పోలీసులను దూషిస్తే జగన్‌కు పుట్టగతులు ఉండవని టీడీపీ మాజీ ఇన్‌చార్జి వైకుంఠం శివప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆటేకల్, ములుగుందం గ్రామాల్లో వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మతో కలసి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలు 11 సీట్లు ఇచ్చినా మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ఇంకా బుద్ధిరాలేదని ధ్వజమెత్తారు. ఇలాగా ఉంటే రాబోయే ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేడని మండిపడ్డారు. పోలీసు అధికారులను బట్టలూడదీసి కొడతానన్నడం ఎంతవరకు సమంజసం అన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి సంక్షేమం వైపు పరుగులు తీస్తుంటే ఓర్వలేక అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మాజీ ఎంపీపీలు కృష్ణ యాదవ్, వెంకటేశ్వర్లు, జీవన్ కుమార్, మల్లికార్జున, రాజశేఖర్, శివప్ప, సుదర్శన్, అంజి, షేక్షావలి, హల్లప్ప పాల్గొన్నారు.

పత్తికొండలో సమ్మెట మిషన్ సీజ్


సమ్మెట మిషన్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

పత్తికొండ, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సవారమ్మ కాలనీ వద్ద జనవాసాల్లో నిర్వహిస్తున్న సమ్మెట మిషన్‌ను శుక్రవారం అధికారులు, పోలీసులు సీజ్‌చేశారు. ఈ సమ్మెట్ మిషన్‌తో తమ ఇళ్ల పునాదులు కదులుతున్నాయని, రాత్రిళ్లు శబ్ధానికి నిద్రపోలేకున్నామని స్థానికులు లోకాయుక్తను ఆశ్రయించారు. లోకాయుక్త ఆదేశాల మేరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, గ్రామ పంచాయతీ, ఆర్‌అండ్‌బీ, పోలీస్ అధికారులు విచారణ నిర్వహించి లోకాయుక్తకు నివేదిక పంపారు. స్పందించిన లోకాయుక్త సమ్మెటమిషన్‌ను సీజ్ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేసింది. దీంతో ఆడీఎల్‌పీవో వీరభద్రప్ప, ఈవో నరసింహులు, వీఆర్‌వో సాగర్‌రెడ్డితో కలసి సీఐ జయన్న సమ్మెటమిషన్ నిర్వాహకులకు లోకాయుక్త ఆదేశాల కాపీని అందజేసి సీజ్‌చేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

తుగ్గలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో లలిత సూచించారు. శుక్రవారం జొన్నగిరి అంగన్వాడీ సెంటర్‌లో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, కౌమార దశలో ఉన్న పిల్లలు కచ్చితంగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పరిసరాల సూపర్‌వైజర్లు అంబికా, త్రివేణి, సిహెచ్‌వో విజయకుమారి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఎల్సీ లేకుండా పనులు చేయరాదు

తుగ్గలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పనులు చేసే సమయంలో ఎల్‌సీ(లైన్ క్లియరెన్స్) లేకుండా చేయరాదని ఏఈ మహేశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం తుగ్గలి సబ్‌స్టేషన్‌లో సిబ్బంది, రైతులతో మాట్లాడారు. విద్యుత్తు మరమ్మతులు, స్తంభాల ఏర్పాటుకు, నూతతన లైన్, విద్యుత్తు కనెక్షన్ల పనులు చేసేటప్పుడు కచ్చితంగా సంబంధిత విద్యుత్ అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. గాలి, ఉరుములు, మెరుపులతో సమస్యలు తలెత్తితే వెంటనే తెలియజేసి ప్రమాదాలను అరికట్టాలన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆదోని, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌గాంధీ నగర్ సమీపాన జలగం వీధిలో శుక్రవారం చోరీ జరిగింది. బాధితులు తెలిపిన మేరకు.. గోపాల్, రాధా దంపతులు ఉదయాన్నే ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లారు. సాయంత్రం వచ్చి చూసేసరికి తాళంతెరిచి ఉండి, ఇంట్లో వస్తువులు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. బీరువాలోని తులం బంగారుతోపాటు 30 తులాల వెండి ఆభరణాలు, రూ.7వేలు దొంగిలించినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రైతు సంఘం ఆవిర్భావ వేడుకలు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కల్లుబావి ప్రాంతంలో ఏపీ రైతు సంఘం ఆవిర్భావ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు మాట్లాడుతూ అఖిలభారత్ కిసాన్ సభ రైతు సంఘం బ్రిటీష్ వలస పాలన భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా ఏర్పడిందన్నారు. సమగ్ర భూ సర్వే పేరుతో కార్పొరేట్ సంస్థలకు భూములను అప్పజెప్పుందని ఆరోపించారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అనుగుణంగా పంటలకు గిట్టుబాటు ధర రుణాలు ఇవ్వాలని కోరారు. నాయకులు రామదాసు, రామాంజినేయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటేశులు

15న దేవర

క్రిష్ణగిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామక్రిష్టాపురం గ్రామంలో 15న దేవర ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు. 13న గణపతి పూజ, మొలకల పూజ, 14న అమ్మవార్లకు ప్రత్యేక పూజ, 15న అర్ధరాత్రి అనంతరం కూష్మాండ బలి పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు రథోత్సవం

తుగ్గలి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలోని అమీనాబాద్‌లో అభయాంజనే టయస్వామి రథోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ విజయలక్ష్మి, టీడీపీ నాయకులు మధుబాబు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నరకదారులు


ఆదోని - హొళగుంద రోడ్డు దుస్థితి

ఆదోని, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆదోని-హొళగుంద రోడ్డు నరకానికి దారిగా మారంది. ఈ దారిలో ప్రయాణించాలంటేనే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదోని నుంచి హొళగుందకు 26కి.మీ దూరం ఉంది. అయితే ఈ రోడ్డుపై ప్రయాణిచాంలటే రెండు గంటలకు పైగానే ప్రయాణించాల్సి వస్తోంది. ఓసారి ఈ రోడ్డుపై వస్తే మరోసారి వచ్చే సాహసం చేయరని స్థానికులు అంటున్నారు. రహదారిపై మోకాళ్ల లోతు గుంతలు పడ్డాయి. చిన్న వర్షం కురిసినా గుంతల్లో నీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

అత్యవసరమైతే అంతే..
అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లాలంటే ఇక అంతే. రోడ్డు ప్రమాద బాధితులు, గర్భిణుల అవస్థలు అంతే. రోజూ పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు కూడా అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డును భరించలేక మరికొందరు దూరమైనా, ఆలూరు మీదుగా ఆదోనికి చేరుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నూతన రహదారి నిర్మించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

వర్షం పడితే అంతే..
హొళగుంద నుంచి ఆదోనికి వెళ్లాలంటే నరకం కనిపిస్తోంది. డాణపురం గ్రామం వరకు వెళ్లాలన్నా కష్టం. మెకాళ్ల లోతు గుంతలు ఉండటంతో వర్షం కురిస్తే ఇక అంతే. **- చాకలి నాగరాజు, హొళగుంద.**



త్వరలో పనులు ప్రారంభం
గత ప్రభుత్వంలో డబుల్ రోడ్డు మంజూరు కాగా, కొన్ని కారణతో రద్దుఅయింది. సింగిల్ రోడ్డుకు ప్రతిపాదనలు పంపాం. టెండర్ ఖరారైతే పనులు ప్రారంభిస్తాం. హొళగుంద నుంచి దణాపురం వరకు 12 ఏళ్ల క్రితం వేశారు సంవత్సరాలుగా రోడ్డుకు మరమ్మతులు చేయలేదు. **- సాయిసురేష్, ఏఈఈ, ఆర్‌అండ్‌బీ, ఆదోని**

‘ఆ ఆరోపణల్లో నిజం లేదు’


వివరణ ఇస్తున్న ట్రాక్టర్ యజమాని

ఆదోని టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్లను అడ్డుకొని బీజేపీ నాయకులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు తాను ఇటీవల సోషల్ మీడియాలో చేసిన ఆరోపణలలో నిజం లేదని చిన్నపెండెకల్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని కృష్ణ తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ, ఒక రాజకీయ పార్టీ నాయకుల బలవంతంతోనే తప్పుడు ప్రచారం చేసానని బీజేపీ అధికార ప్రతినిధి విజయ కృష్ణకు వివరించారు. ఇసుక సరఫరా చేసే వారిని బెదిరించి బీజేపీ నాయకులపై బురద జల్లితే ప్రజలు నమ్మరని, పట్టణాభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి అవినీతిని ప్రోత్సహించే ప్రసక్తే లేదని విజయ కృష్ణ అన్నారు. జిల్లా కార్యదర్శి రమాకాంత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బకాయిలపై వడ్డీ మాఫీ గడువు పెంపు

● ముందస్తు చెల్లింపునకు 5 శాతం రాయితీ

ఆదోని టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను బకాయిదారులకు ప్రభుత్వం వడ్డీ మాఫీని ఈనెల 30వ తేదీ వరకు పొడిగించింది. దీంతో ఆదోని మున్సిపల్ కార్యాలయంలోని కౌంటర్లలో పన్నులు చెల్లించేందుకు ప్రజలు బారులుదీరారు.

ఏకమొత్తంగా పన్నులు చెల్లించేవారికి..
2025-2026వ సంవత్సరానికి ముందుగా ఏకమొత్తంగా పన్నులు చెల్లించే వారికి 5శాతం రిబేటును ప్రభుత్వం ప్రకటించింది. గతేడాది ముందస్తు చెల్లింపులు రూ.2.15 కోట్లు కాగా, ఈ ఎడాది రు.4కోట్లు వసూలు చేయాలన్న లక్ష్యంతో అధికారులు ప్రచారం చేస్తున్నారు. ఈనెల 30 వరకు ప్రభుత్వ రిబేటు అవకాశం కల్పించింది.


బారులుదీరిన పన్ను చెల్లింపుదారులు

రుచి, శుచికి ప్రాధాన్యమివ్వండి

ఆదోని టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లలో రుచి, శుచికి ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ సూచించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని అన్న క్యాంటీన్లను పరిశీలించారు. పరిసరాల్లో పారిశుధ్య నిర్వహ ణను పరిశీలించి సూచనలు చేశారు. నిర్వా హకులు అందజేస్తున్న ఆహార పదార్థాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆహారంతో పాటు శుద్ధిచేసిన తాగునీటిని అందించాలని నిర్వాహకులకు సూచించారు.


ఆహార పదార్థాలపై విచారిస్తున్న కమిషనర్


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లో కేష్ కుమార్

బీజేపీతోనే పట్టణాభివృద్ధి

ఆదోని, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే పట్టణాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లోకేష్ కుమార్ అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఎమ్మెల్యే పార్థసారధి ఆదేశాలతో శుక్రవారం బస్తీకి పోదాం నిర్వహించారు. రాయనగర్ కాలనీలో బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సచివాలయం, పాఠశాల భవనం, అంగన్వాడీ సెంటర్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను పరిశీలించారు. వార్డులో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. పట్టణ సెంట్రల్ అధ్యక్షుడు తోవి నాగార్జున, సెంట్రల్ కార్యదర్శి శివరాం, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జితేంద్ర, ప్రశాంత్, గోవింద బాబు పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామీణాభివృద్ధి

హొళగుంద, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమనపి ఆ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ నర్సానాయక్, బోయ మల్లికార్జున, రాజశేఖర్ గౌడ్, డాక్య నాయక్ అన్నారు. శుక్రవారం పల్లె పండుగలో భాగంగా రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, సీఎం చంద్రబాబుకు, రుణపడి ఉంటామని గ్రామస్తులు అన్నారు.


పనులను ప్రారంభిస్తున్న నాయకులు

విద్యుత్ సరఫరాలో మార్పులు

క్రిష్ణగిరి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నేడు రెండో శనివారం కారణంగా లక్కసాగరం, క్రిష్ణగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో మార్పులు చేసినట్లు ఏఈ మద్దిలేటి శుక్రవారం తెలిపారు. ఉదయం 6గంటల నుంచి 10గంటల వరకు, మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 6గంటల వరకు వ్యవసాయ అవసరాలకు రైతులకు త్రీ పేస్ విద్యుత్ సరపరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులు గమనించాలని సూచించారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి


పొగాకును పరిశీలిస్తున్న రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పొగాకు దిగుబడిని కొనుగోలు చేయాలని లేకపోతే ఎకరాకు రూ.లక్ష చొప్పున నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘం అధ్యక్షుడు రామచంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామాల్లో పండించిన పొగాకు పొలాలను రైతుసంఘం బృందం పరిశీలించింది. జీపీఐ సంస్థ పొగాకును క్వింటం రూ.15 వేల ప్రకారం కొనుగొలు చేస్తామని మయమాటలు చెప్పి, సాగుచేయించి ఇప్పుడు మాట మార్చారన్నారు. నేడు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నామన్నారు. రాజాసాహెబ్, కారన్న, పొగాకు రైతులు ఓబులేషు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలూరుకు ప్రత్యేక నిధులు ఇవ్వాలి


కుందనగుర్తి గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

చిప్పగిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ఆలూరు నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే విరుపాక్షి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కుందన గుర్తి గ్రామంలో వైసీపీ నాయకుడు నాగప్ప కుమారుడు ప్రతాప్ వివాహానికి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్లు తాగునీరు సమస్య అదికంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైకుంఠం మల్లికార్జున, చౌదరి, దౌల్తాపురం కావలి ప్రభాకర్, ఎంపీపీ హేమలత, మాజీ కన్వీర్ బెల్డోణ ఓబులేసు, మాజీ సర్పంచ్ శేఖర్, జూటూరు మారయ్య, దాసరి గోవిందరాజులు పాల్గొన్నారు.

జ్యోతిబా పూలే జయంతి

● నివాళి అర్పించిన నాయకులు, అధికారులు, విద్యార్థులు



పత్తికొండ టీడీపీ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న నాయకులు


ఆదోనిలో నివాళి అర్పిస్తున్నఉమాపతినాయుడు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జ్యోతిబా పూలే 198వ జయంతిని శుక్రవారం పట్టణంలోని బీసీ ఫెడరేషన్, ఎమ్మార్పీఎస్ నాయకులు వేరువేరుగా నిర్వహించారు. బీసీ పెడరేషన్ కార్యాలయంలో ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు జిల్లా గౌరవాధ్యక్షుడు సాయి బాబా నివాళి అర్పించారు. కత్తి హనుమంతరావు, దేవి శెట్టి ప్రకాష్, రాజేశ్వరరావు, వీరేష్, వడ్డే శ్రీనివాసులు, మల్లేశ్వరప్ప, దీపక్, తాయప్ప అమర్నాథ్ పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు తిమ్మన్న, హుస్సేనప్ప, బాలన్న, మాదాసు జగన్, గుమ్మల బాలస్వామి, గణేష్ పాల్గొన్నారు.

జ్యోతిబా పూలేకు ఘననివాళి
పత్తికొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జ్యోతిబా పూలే జయంతిని పత్తికొండ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు చల్లారవి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే పత్తికొండ ఏపీడీ కార్యాలయంలో సిబ్బంది నివాళి అర్పించారు.

ఘనంగా జ్యోతిబా పూలే జయంతి
పత్తికొండ టౌన్. ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర పాఠశాలలో హెచ్‌ఎం మాలతి, బీసీ సంఘం నాయకులు శ్రీనివాసులు, దండి మల్లిర్జున, పీఈటీ రాజేష్, రామాంజినేయులు, పాల్గొన్నారు.
ఆదోని: టీడీపీ కార్యాలయంలో ఉమాపతి నాయుడు నివాళి అర్పించారు. మాజీ ఎంపీటీసీ రంగన్న, తిమ్మప్ప, మల్లికార్జున, బాబు నాయుడు, కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

జ్యోతిబా పూలే జయంతి
ఆదోని టౌన్: బీసీ సంఘం సభ్యులు పనిర్వహించారు.ఎండీ బసవరాజ స్వామి, సాకరే మల్లేశ్వర రావు, గోవింద రావు, జిఆంజనేయులు, గుడికల్ కుమార స్వామి, మురళీధర్ గౌడ్, జామిర్, మల్లేష్ పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు
ఆదోని రూరల్: మండల కార్యాలయంలో నిర్వహించారు. మాజీ ఎంపీపీ ఎంపాపతి, సీనియర్ అసిస్టెంట్ వీరభద్రయ్య ఉన్నారు.

రజకులను ఆదుకోవాలి


పురంధేశ్వరితో సావిత్రి

ఆదోని టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రజకులను ఆదుకోవాలని రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరిని కోరారు. శుక్రవారం విజయవాడలో ఆమెను కలిసి రజకుల ఇబ్బందులను వివరించారు. మోడరన్ దోబీ ఘాట్లు ఏర్పాటు చేయడంతో పాటు, మత్స్యకారులు, చేనేతలకు ఇస్తున్న విధంగా 50 సంవత్సరాలు నిండిన రజకులకు పించన్ సౌకర్యం కల్పించాలని కోరారు. స్పందించిన పురందేశ్వరి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని సావిత్రి తెలిపారు.

ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

మద్దికెర, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐసీడీఎస్ సీడీపీవో లలిత ఆదేశించారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడాలో మాట్లాడుతూ గర్భం నుంచి బిడ్డ పుట్టి రెండు సంవత్సరాలు పూర్తయ్యేవరకు బిడ్డ పెరుగుదల వేగంగా ఉంటుందన్నారు.


మరమతులు చేస్తున్న పురపాలక సిబ్బంది

తాగునీటి పైపులైన్ లీకేజీ

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు తాగునీరు అందించే ప్రధాన పైప్‌లైన్ బసాపురం రహదారిలోని మార్కెట్ యార్డ్ ప్రధాన ద్వారం వద్ద శుక్రవారం లీకేజీకి గురైంది. దంతో తాగునీ వృథాగా పారింది. బసాపురం ఎస్‌ఎస్ ట్యాంక్ నుంచి పట్టణానికి వీరంధించే ప్రధాన పైప్‌లైన్ ఇది. ఈ రహదారిలో పరిశ్రములు ఉండటంతో నిత్యం భారీ వాహనాలు వెళుతుంటాయి. వాహనల రాకపోకలనేతోనే పైపులైన్ పగిలిందని స్థానికులు అంటున్నారు. నీరు సుమలత అనే మహిళ ఇంట్లోకి పారి, బియ్యం వంట సామగ్రి హోటల్‌కు సంబంధించిన వస్తువులు, బట్టలు తడిచిపోయాయి. మున్సిపల్ సిబ్బంది వెంటనే స్పందించి మరమ్మతులను చేశారు.

మేమింతే..!

● ఉదయం 11 గంటలైనా తెరుచుకోని తహసీల్దార్ కార్యాలయం



తాళం వేసి ఉన్న కార్యాలయం

హొళగుంద, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో, తహసీల్దార్‌లతో పాటు సిబ్బంది కూడా సమయపాలన పాటించడం లేదని టీడీపీ నాయకులు ఎర్రిస్వామి పంపాపతి, దిడ్డి వెంకటేష్, సిద్ధిక్ సాబ్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఉదయం 11 గంటల తరువాత కూడా రాలేదన్నారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గోవింద రావ్ మినహా ఏ అధికారి హాజరుకాకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ నిజాముద్దీన్‌ను వివరణ కోరగా కలెక్టర్ మీటింగ్‌లో ఉన్నానని, మిగతా అధికారులు ఎవరు రాకపోవడంపై విచారణ చేస్తామని తెలిపారు.

వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలి


వైద్యులకు సూచనలు ఇస్తున్న సీడీపీవో లలిత

మద్దికెర, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి రాగిణి సూచించారు. శుక్రవారం యం.అగ్రహారం గ్రామంలో అవగాహన కల్పించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కొద్ది రోజుల నుంచి వడగాలులు విస్తున్నాయని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించారు. వడదెబ్బ సోకినవారిని నీడలోకి తీసుకెళ్లి చల్లటితడిబట్టతో తుడవాలని, ఆసుపత్రికి తరలించాలన్నారు. హెల్త్ ఏడ్యుకేటర్ అక్బర్‌బాష, ఏఎన్ఎం గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

మందు గుండు సామగ్రి తయారీదారుల అరెస్ట్

గోనెగండ్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలువాల గ్రామంలో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మందుగుండు సామగ్రిని తయారుచేస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలు. అలువాల గ్రామ శివారులోని పొలంలో రహస్యంగా ఒక ఇంట్లో మందుగుండు సామగ్రి ఔట్లు, చిచ్చుబుడ్లతో పాటు పెద్ద శబ్ధంతో పేలే మందుగుండును తయారుచేస్తున్నట్లు సమాచారం అందింది. ఆఇంటిపై పోలీసులు దాడులుచేసి సర్కార్ వలితో పాటు మరో ఇద్దరిని అరెస్టుచేసి వారి దగ్గరనుంచి మందుగుండును స్వాధీనం చేసుకున్నారు. పదేళ్ల క్రితం ఇదే గ్రామంలో అక్రమంగా పెళ్లివేడుకలకు, దేవరలకు మందుగుండు సామగ్రి తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలి ఎనిమిది మంది మృతిచెందిన సంఘటన జరిగింది. దీంతో అప్పటి నుంచి అలువాలలో మందుగుండు సామగ్రి తయారుచేయడం నిలిపివేశారు. మళ్లీ ప్రభుత్వ అనుమతిలేకుండా తయారు చేయడంతో శుక్రవారం పోలీసులు దాడులుచేసి అక్రమంగా మందుగుండును తయారు చేస్తున్న వారిని అరెస్టుచేసినట్లు సీఐ తెలిపారు.

అంబేడ్కర్ జయంతిని జయప్రదం చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నందవరం, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామం నుంచి అంబేడ్కర్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని అంబేద్కర్ భవన సాధన కమిటీ చైర్మన్ కదిరికోట ఆదెన్న పిలుపునిచ్చారు శుక్రవారం మండలంలోని ముగతి, హాలహర్వి గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆనంద్ చైతన్య ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కులవృత్తుల ప్రదర్శనలు జరుగుతాయన్నారు. తలసేమియా బాధిత కుటుంబాల పిల్లలకు ప్రాణాలు కాపాడేందుకు కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. నరసన్న, దేవపాల్, దావీదు, అబ్రహం, ఏసుబు, దుబ్బన్న, ప్రకాశం, నాగరాజు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి గోపాల్

కోసిగి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి గోపాల్, కాంగ్రెస్ మైనార్టీ నాయకులు జిలాని అన్నారు. శుక్రవారం కోసిగిలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ, కాంగ్రెస్ నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 50శాతం ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయని, వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించిన చట్టాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, వీరేష్ ఓంకార్‌స్వామి, తాయన్న, బాబు, నరసింహులు, పాల్గొన్నారు.

రైతు సమస్యలపై నిరంతర పోరాటం


నినాదాలు చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని రైతు సంఘం నాయకులు అబ్దుల్లా, లక్ష్మీనర్సయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని సుందరయ్య భవన్ దగ్గర అఖిలభారత కిసాన్ సభ ఆవిర్భావదినోత్సవాన్ని సీఐటీయూ నాయకులు గోవిందు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ సంక్షోభానికి డాక్టర్ స్వామినాథన్ చేసిన సిఫారస్సులు నేటికీ అమలుకు నోచుకోవటం లేదన్నారు. అఖిల భారత కిసాన్ సభ ఏప్రిల్ 11, 1936న లక్నోలో ఏర్పడిందన్నారు. నాటి నుంచి నేటివరకు రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేయటం జరుగుతోందన్నారు. నాయకులు రాముడు, రమేష్, కృష్ణ, నామాల రాముడు, సుభాన్,పరమేష్, సురేష్, బజారి, తిమ్మయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

నందవరం: రైతు సమస్యల పరిష్కారమే ఏపీ రైతు సంఘం లక్ష్యమని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్ అన్నారు. శుక్రవారం నందవరం గ్రామంలో ఏపీరైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ దున్నేవాడిదే భూమిహక్కు కావాలని రైతుల తరుపున పోరాటం చేస్తుందని వారన్నారు. రైతులకు పట్టాదారుపాస్ పుస్తకాలు, సబ్సిడీ విత్తనాలతో పాటు రైతు సంక్షేమం కోసం పోరాడుతున్న సంఘం ఏపీ రైతు సంఘం అని అన్నారు. నాయకులు గిడ్డయ్య, శాంతప్ప, ముని రామలింగడు, నరసింహులు, తిమ్మప్ప, నరసప్ప, బీమన్న, నాగేంద్రప్ప పాల్గొన్నారు.

మద్యం పట్టివేత.. కేసు నమోదు

గోనెగండ్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అలువాల గ్రామంలో పిచ్చిగుంట్ల కృష్ణ, సీ బెళగల్ గోపాల్ అక్రమంగా కర్ణాటక మద్యం అమ్మకాలు జరుపుతుండటంతో వారిని అరెస్టుచేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలు.. అలువాలకి చెందిన పిచ్చి గుంట్ల కృష్ణ, సీ బెళగల్ గ్రామానికి చెందిన గోపాల్ ఇద్దరు కలసి గత కొంతకాలంగా అక్రమ మద్యం అమ్మకాలు జరిపేవారు. అయితే ఈ సమాచరం పోలీసు లకు చేరడంతో శుక్రవారం అలువాల గ్రామంలో పిచ్చిగుంట్ల కృష్ణ ఇంట్లో పోలీసు లు సోదా చేయగా అక్కడ వారి దగ్గర ఉన్న 39 కర్ణాటక మద్యం బాటిళ్లు, రెండు ఆంధ్రమద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని అమ్మకాలు జరిపే కృష్ణ, అక్రమ మద్యంను సరఫరా చేస్తున్న బెళగల్ గోపాల్ పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బడుగువర్గాల ఆశాజ్యోతి పూలే

- ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు ఘన నివాళి
- సేవలను కొనియాడిన నాయకులు, అభిమానులు
- కౌతాళంలో స్కౌట్స్ విద్యార్థుల ర్యాలీ

మంత్రాలయం/ కౌతాళం/ గోనెగండ్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజోతి): బడుగువర్గాల ఆశాజ్యోతి, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే అని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం పూలే 198వ జయంతిని పురస్కరించుకొని ఘనంగా ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రాలయంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర ఐక్యవాల్మీకీ పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బి. లక్ష్మన్న, ఏఐవైఎఫ్, కేవీపీఎస్, బీసీ హాస్టల్లో చిన్న, రాజు, జయరాజు, అంజి, వార్డన్ గోపాల్, ఫిజికల్ డైరెక్టర్ రవీంద్ర వేర్వేరు సమయాల్లో అంబేద్కర్ విగ్రహం వద్ద జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులరించారు.ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బీవీ రవిచంద్ర, గురురాజ్, రఘు, పవన్, రాము, ఇజ్రాయేలు, జెర్మియా, మురళి, వెంకటేష్, వినయ్, సాలేంరాజు ,కేశవ్, సురేష్ పాల్గొన్నారు. కౌతాళం మండలంలోని ఎరిగేరి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎం రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో స్కౌట్స్ విద్యార్థులు పాఠశాల నుంచి గ్రామంలోని పూలే విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల పీఈటీ రాము పాల్గొన్నారు. గోనెగండ్లలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో కేవీపీఎస్, సీఐటీయూ ఆటో యూనియన్ నాయకులు వేణు, హనమన్న పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మారేష్, ఆటోయూనియన్ నాయకుడు బాబు, రాజు, వలి, సరేష్ మున్నా, మ ఎనెప్ప, రాకేష్, రంగ స్వామి యూనియన్ నాయకులు తదిత రులు పా ల్గొన్నారు.


మంత్రాలయంలో జ్యోతిబా పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జనసేన ఇన్‌చార్జి లక్ష్మన్న


కౌతాళంలో ర్యాలీ నిర్వహిస్తున్న స్కౌట్స్, విద్యార్థులు

హెచ్ కైరవాడి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు జ్యోతిబా పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మిగనూరు పట్టణంలో టీడీపీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా, దళిత సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో, వైసీపీ పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిఅర్పించారు. స్థానిక శాఖ గ్రంథాలయం దగ్గర, ఏపీఎంఆర్‌పీఎస్, బీసీ సంఘాలు, సంజీవయ్య నగర్‌లోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో మాలమహానాడు ఆధ్వర్యంలో, ఎస్‌ఏపీ అతిదిగృహం దగ్గర బిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు రామతీర్థం అమ్రేష్ ఆధ్వర్యంలో, పట్టణ నిరాశ్రాయిల ఆశ్రమంలో జైభీం ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో వేదాస్ స్వచ్ఛంద సేవా సమితి డైరెక్టర్ సునీల్ కుమార్ పాల్గొని మహత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. పూలే , అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి ప్రముఖ సామాజిక వేత్త డా మల్లేల ఆల్‌ఫ్రెడ్ రాజు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ నాయకులు కొండయ్య చౌదరి, ఈరన్న గౌడ్, రామదాసు గౌడ్, మిఠాయి నరసింహులు, మహేష్, రంగస్వామి గౌడ్, జయన్న, దేవదాసు, ఇసాక్, శాలేమ్, రామకృష్ణ, సూరి, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాసులు, ప్రజాసంఘాల నాయకులు జయరాజు, చార్లెస్, బుజ్జిబాబు, ప్రభాకర్, నరసన్న, బతకన్న పాల్గొన్నారు.


ఎమ్మిగనూరు టీడీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


గోనెగండ్లలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

రాఘవేంద్రస్వామికి పుష్పాలంకరణ

- మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు
- మంచాలమ్మకు విశేష పూజలు
- ఘనంగా పీఠాధిపతి జన్మదిన వేడుకలు
- గజమాలతో సన్మానం

మంత్రాలయం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి బంగారు కవచం సమర్పణతో పాటు విశేష పుష్పాలంకరణ సేవచేశారు. చైత్రచతుర్దశి శుక్రవారం శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, క్షీరాభిషేకం, తులసీఅర్చన, విశేష పంచా మృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టువస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. గ్రామ దేవత మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేలాదిగా భక్తులు

రాఘవేంద్రస్వామి దర్శనానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. భక్తుల రద్దీపెరగడంతో లాడ్జీలు, హో టళ్లు, పూజా సామగ్రికి డిమాండ్ పెరిగింది.


రాఘవేంద్ర స్వామి బృందావనం అలంకరణ


పీఠాధిపతికి తులాభారం వేస్తున్న భక్తులు


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు

ఘనంగా పీఠాధిపతి జన్మదిన వేడుకలు

పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల జన్మదిన వేడుకలు భక్తులు, శ్రీమఠం ఉద్యోగులు, గ్రామస్థుల మధ్యన ఘనంగా జరుపుకున్నారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శ్రీమఠం ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యద ర్శులు సురేష్, రవికులకుర్ణి, మేనేజర్లు శ్రీపతి ఆచార్, ఐపీ నరహింహమూర్తి, ఏఈ బద్రినాథ్ శాలువా లు, గజమాలలువేసి పూల తో అభిషేకిం చారు. డ్రైఫ్రూట్స్‌తో తులాభారం చేశారు. పీఠాధిపతి జన్మదినాన్ని పురస్కరిం చుకొని కర్నూల్ బ్లడ్‌బ్యాంక్ వారి సహకారంతో రక్తదాన శిబిరం, అన్నదానం, అనాథలకు ని త్యావసర సరుకులు, 50వేల మొక్కలు పంపి ణీ చేశారు. తులసీవనం పీఠాధిపతి మొక్క లు నాటారు. మంత్రాలయంలోని దుకాణ, లాడ్జీ, ప్రజలు పీఠాధిపతికి జన్మదిన

బడి వయసు పిల్లలు బడిలో ఉండాలి: డీఈవో

కౌతాళం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బడి బయట ఉన్న బడీడు పిల్లలను తప్పక బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఈవో శామ్యూల్ పాల్ అన్నారు. మండల కేంద్రమైన కౌ తాళంలోని ఎమ్మార్సీ భవన్‌లో ఎంఈఓ శోభా రాణితో డ్రాప్ అవుట్స్ పిల్లలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లా డుతూ ప్రభుత్వం ప్రతి పిల్లవాడిని బడిలో ఉండేలా చూడాలన్న ఉద్దేశ్యంతో బడిబయట పిల్లలపై ప్రత్యేకశ్రద్ధ చూపుతుందన్నారు. బడి బయట పిల్లలు ఎందుకు ఉన్నారని విద్యార్థు లతో, వారి తల్లిదండ్రులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని తనిఖీచేసి విద్యార్థినులతో కలిసి నేలపై కూర్చొని వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎంఈఓ-2 శోభారాణి, సీఆర్పీలు ఉన్నారు.

కోసిగి : ప్రభుత్వ బడుల్లో చదువుతూ బడులకు రాకుండా మధ్యలో మానివేసిన విద్యార్థులను బడిలో చేర్పించే కార్యక్రమం చేపడుతున్నట్లు డీఈవో శామ్యూల్ అన్నారు. కోసిగి మండల పరిధిలోని పల్లెపాడుతో పాటు పలు గ్రామాల బడి మానివేసిన విద్యార్థులను ఆయా గ్రామాల్లో విద్యా ర్థుల తల్లి దండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి బడిలో చేర్చారు. ఈ కార్యక్రమంలో ఏఈవో2 శోభారాణి, బాలుర పాఠశాల హెచ్ఎం ఖలీల్ అహ్మద్, సీఆర్‌పీ అనంతరామ్, పాల్గొన్నారు.


కోసిగిలో విద్యార్థులతో డీఈవో శామ్యూల్ పాల్

తవ్వారు.. వదిలేశారు

- ఆగిన అండర్ డ్రైనేజీ పనులు
- ఇబ్బందుల్లో కాలనీవాసులు

మంత్రాలయం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామచంద్రనగర్‌లో అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం సీసీ రోడ్డును తవ్వి అలాగే వదిలేశారు. దీంతో ఆ కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరవై రోజుల క్రితం రూ.15 లక్షలతో 450మీటర్ల పొడవుతో అడుగు వెడల్పు ఉండే పీవీసీ పైపు పనులు చేపట్టారు. ఈపైపును అమర్చేందుకు సీసీ రోడ్డును తవ్వి ఆరు రోజులు కావస్తున్నా పట్టించుకునే వారులేరు. రోడ్డును దాటాలంటే వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు, ద్విచక్ర వాహనదారులు, ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వెంకటరాముడును వివరణ కోరగా పైపులు ఆర్డర్ పెట్టామని, త్వరలో పైపులు వేసి మూసివేస్తామని తెలిపారు.


అండర్ డ్రైనేజీ కోసం తవ్వేసిన రోడ్డులో ఇరుక్కున్న కారు

నేడు లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం

గోనెగండ్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబాడులో అంపయ్యపౌర్ణమిని పురస్కరించుకొని శనివారం లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీరాములు, వైస్‌చైర్మన్ రేగి రాముడు తెలిపారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలకంరించారు. జిల్లా స్థాయి పొట్టేళ్ల పందెం పోటీలు నిర్వహిస్తున్నారు. గెలుపొందినవారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.15వేలు, రూ.10వేలు, రూ. 5వేలు ఇవ్వనున్నారు. 13న రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రవేశ రుసుము రూ.1000 చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలి. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో, ఐదు, ఆరో బహుమతులుగా రూ. 65వేలు, రూ. 45వేలు, రూ. 35వేలు, రూ. 25వేలు, రూ. 15వేలు, రూ. 10వేలు ఇవ్వనున్నారు. 14న ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శన


శ్రీకృష్ణ వేషధారణలో నృత్యం చేస్తున్న చిన్నారులు

మంత్రాలయం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలోని యాగశాలలో కర్నాటకలోని హసన్‌కు చెందిన ప్రముఖ అంతార్జాతీయ భరతనాట్య కళాకారిణ స్వాతి భరద్వాజ ఆధ్వర్యంలో 150మంది చిన్నారులచే ఏకధాటిగా నిర్వహించిన శ్రీకృష్ణ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. శుక్రవారం రాత్రి యాగశాలలో శ్రీకృష్ణ పాటలకు చిన్నారుల ఏకకాలంలో చేసిన ప్రదర్శన కనువిందు చేసింది. ఈనాటికను కనులార తిలకించిన పీఠాధిపతి చిన్నారులకు నగదు, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

మదిరెలో సామూహిక వివాహాలు


నూతన జంటలను ఆశీర్వదిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నాయకులు

కౌతాళం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదిరెలో ఉన్న ఉటగనూరు తాత మఠంలో శుక్రవారం 25 జంటలు ఒక్కటయ్యారు. మఠం ధర్మకర్త పంపారెడ్డి తాత ఆధ్వర్యంలో దాతలు, గ్రామస్థులు సహకారంతో ఘనంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తన సొంత ఖర్చుతో 25జంటలకు మంగళసూత్రాలను, కాలిమెట్లను, ముక్కుపుడకలను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప అందజేశారు. వీటిని తిక్కారెడ్డి సోదరుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి మండల నాయకులతో కలసి హాజరై నూతన జంటలకు అందజేసి వారిని ఆశీర్వదించారు. ర్వాదించారు. వీరికి గ్రామస్తులు డప్పువాయిద్యాలతో స్వాగతం పలికారు. ఉటగనూరు మఠంలో వివాహాలకు హాజరైన నాయకులను, వివిధ మఠాల పీఠాధిపతులను పూలమాల శాలువాలతో సన్మానించారు. గ్రామ సర్పంచ్ రంగస్వామి, హచ్చోళ్ళి మఠం పీఠాధిపతి రుద్రముని స్వాములు, టీడీపీ నాయకులు బాపురం శివమోహన్ రెడ్డి, కోట్రేష్‌గౌడ్, రమేష్‌గౌడ్, కురుగోడు, బాపురం వెంకటరెడ్డి ఉన్నారు.

నేడు రామలింగేశ్వరస్వామి కలశ ప్రతిష్ఠాపన

కోసిగి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరులోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కుంబాభిషేకం, మహా రథోత్సవం ఉంటుందని వారు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమాజసేవతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం

గోనెగండ్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సమాజసేవతోనే ఆత్మస్థైర్యం పెంపొందుతుందని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు సమీర్, శంకరయ్య, ఉమా అన్నారు. శుక్రవారం గోనెగండ్ల మోడల్ స్కూల్ నందు ఆరవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు స్కౌట్ అండ్ గైడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులలో నైతిక విలువలు, సమాజసేవ, ఆత్మస్థైర్యం పెంపొందించే విధంగా ప్రవర్తనలో మార్పు రావడం కోసం స్కౌట్ అండ్ గైడ్స్ ఎంతో ఉపయోగపడతాయని వారన్నారు. అలాగే త్వరలో గోనెగండ్ల మోడల్ స్కూల్‌లో పీఎం శ్రీఫేష్ 2 కింద భారత్ అండ్ స్కౌట్ అండ్ గైడ్స్ ఏపీజే అబ్దుల్ కలామ్ యూనిట్ ఏర్పాటు కాబోతుందని వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను స్కౌట్ అండ్ గైడ్స్‌లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 50 మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు


విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు